# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 232

VEKUVA SAMAYAM TELUGU DAILY

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy | సంపాదకులు : కె.భాస్కర్‌రావు | రూ.2.00/- పేజీలు 8 | తేది: శనివారం 26 సెప్టెంబర్ 2026








**సమయం ప్రతినిధి:** కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) ఉద్యమానికి సిద్ధమైంది. 24 గంటల్లో ఆయన రాజీనామా చేయకపోతే.. వచ్చే నెల 2 నుంచి ముంబైలో దేశవ్యాప్తంగా నిరసనలు చేపడతామని సీజేపీ చీఫ్ అభిజీత్ దీప్కే ప్రకటించారు. ఆ తర్వాత క్రమంగా దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు విస్తరించేలా చేస్తామన్నారు. ఎన్నికల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియలో భాగంగా.. భారీగా ఓటర్లను తొలగించారంటూ సీజేపీ అభ్యంతరం తెలుపుతోంది. ఇదే ప్రధానాంశంగా 'ఎలక్షన్ కమిషన్ ఠీక్ కరో' పేరిట దేశవ్యాప్తంగా ప్రచారం చేపడుతోంది. 'సర్' ప్రక్రియ పూర్తైన రాష్ట్రాల్లో వెలువడిన గణాంకాల ఆధారంగా.. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాల నుంచి సుమారు 13 కోట్లకు పైగా పేర్లు తొలగించారని సీజేపీ ఆరోపిస్తోంది. ఇలా పెద్దఎత్తున ఓట్లను తొలగించడంతో ఓటు హక్కుపై ప్రభావం చూపుతుందని అభిజీత్ దీప్కే ఆరోపించారు. ప్రతి ఓటును చట్టబద్ధంగా, పారదర్శకంగా, సమర్థవంతమైన సమీక్షకు లోబడి ఉందని ఈసీ వివరించాల్సిన బాధ్యత ఉందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్‌లో 'సర్' ప్రక్రియకు సంబంధించిన కొన్ని అంశాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ వచ్చిన వార్తల నేపథ్యంలో.. సీజేపీ మరింత జోరుగా ప్రచారం చేస్తోంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయకపోతే దేశవ్యాప్త ఆందోళనతో పాటు ఢిల్లీలో 'జంతర్ మంతర్ 2.0' తరహా నిరసన చేపడతామని సీజేపీ గతంలో ప్రకటించింది.




**సమయం ప్రతినిధి:** ప్రముఖ శైవక్షేత్రమైన కేదార్‌నాథ్‌లో పర్యాటకుల రద్దీతో రోజురోజుకూ చెత్తాచెదారం ఎక్కువైపోతోంది. యాత్రికుల రద్దీ ప్రభావం కారణంగా.. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు కేవలం ఐదు నెలల్లోనే సుమారు 50.30 మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయింది. గత మూడేళ్లలో ఎన్నడూలేని విధంగా ఇంత భారీగా వ్యర్థాలు పేరుకుపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని నొయిడాకు చెందిన అమిత్ గుప్తా అనే వ్యక్తి సమాచార హక్కు చట్టం(ఆర్‌టీఐ) కింద కోరిన వివరాల మేరకు కేదార్‌నాథ్ నగర్ పంచాయతీ కార్యాలయం ఇచ్చిన సమాధానంలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. గణాంకాల ప్రకారం.. కేదార్‌నాథ్‌లో 2023లో 32.58 టన్నులు, 2024లో 26.10 టన్నులు, 2025లో 21.40 టన్నుల వ్యర్థాలు నమోదయ్యాయి. అయితే.. ఈ ఏడాది ఏప్రిల్–ఆగస్టు నెలల్లోనే అది 50.30 టన్నులకు చేరింది. ఈ పరిమాణం 2023 ఏడాది మొత్తంతో పోలిస్తే సుమారుగా 54 శాతం ఎక్కువ కాగా.. 2024తో పోలిస్తే 93 శాతం, 2025తో పోలిస్తే ఏకంగా 135 శాతం అధికం కావడం గమనార్హం. ఈ ఏడాది నెలల వారీగా చూస్తే.. ఏప్రిల్‌లో 1.7 టన్నుల వ్యర్థాలు నమోదవ్వగా.. మే నెలలో యాత్రికుల రద్దీ పెరగడంతో అది ఒక్కసారిగా 16.3 టన్నులకు చేరింది. జూన్‌లో 11.5 టన్నులు, జూలైలో 10.5 టన్నులు, ఆగస్టులో 10.3 టన్నుల చెత్త పేరుకుపోయింది. ఈ వ్యర్థాల ద్వారా ఇప్పటివరకు సుమారు 20 మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వెలువడినట్లు తెలుస్తోంది.




**సమయం ప్రతినిధి:** సికింద్రాబాద్ సీజీఎస్టీ కమిషనరేట్ పరిధిలో భారీ జీఎస్టీ మోసం వెలుగులోకి వచ్చింది. ఉనికిలోలేని, పనిచేయని సంస్థల పేరుతో బోగస్ ఇన్వాయిస్‌లు, అక్రమంగా ఐటీసీలు (ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్) పొందిన ముఠా గుట్టు రట్టయింది. ఈ కేసులో మాస్టర్‌మైండ్‌ను సెంట్రల్ జీఎస్టీ యాంటీ అధికారులు అరెస్టు చేశారు. నిందితుడిని ముషీరాబాద్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. టీఎంటీ బార్లు, స్టీల్ పైపులు, ట్యూబుల వ్యాపారం పేరుతో మోసం అతను మోసం చేస్తున్నట్లు గుర్తించారు. జీఎస్టీ రిజిస్ట్రేషన్లు రద్దయిన సంస్థల నుంచి కూడా ఇన్వాయిస్‌లు తీసుకున్నాడు. సరుకులు వాస్తవంగా తీసుకోకుండానే రూ.32.28 కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ కట్టాల్సి ఉంటుంది. అవేమీ చెల్లించకుండా బోగస్ ఐటీసీని జీఎస్టీ బకాయిల చెల్లింపులకు వినియోగించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఫీల్డ్ వెరిఫికేషన్‌లో సరఫరాదారులు బోగస్ సంస్థలుగా నిర్ధారణ అయింది. సాక్ష్యాలు, వాంగ్మూలాల ఆధారంగా ఈనెల 24న ప్రధాన నిందితుడిని అరెస్టు చేశారు. సీజీఎస్టీ యాక్ట్ సెక్షన్ 69 కింద కేసు నమోదు చేశారు. అధికారులు అతడిని డ్యూటీ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా మేజిస్ట్రేట్ 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారు. కేసులో మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నామని సెంట్రల్ జీఎస్టీ అధికారులు వెల్లడించారు.




**సమయం ప్రతినిధి:** రాష్ట్రంలో భారీ వర్షాలకు కారణమైన తీవ్ర వాయుగుండం క్రమక్రమంగా బలహీనపడుతూ.. అల్పపీడనంగా మారే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు తెలిపారు. ఈ మేరకు కోస్తాంధ్రలో మరో రెండు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశముందని వారు తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం విశాఖ సమీపంలో తీరం దాటడంతో.. రాష్ట్రంలో ఐదు రోజులపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం ఈ తీవ్ర వాయుగుండం క్రమక్రమంగా బలహీనపడుతూ.. వాయవ్య దిశగా పయనిస్తోంది. తీవ్ర వాయుగుండం కాస్త దక్షిణ ఒడిశా, చత్తీస్‌గడ్ ప్రాంతాలకు చేరేసరికి వాయుగుండంగా మారిందని.. రానున్న 12 గంటల్లోగా మరింత బలహీనపడి అల్పపీడనంగా మారుతుందని వాతావరణశాఖ తెలిపింది. ఈ మేరకు కోస్తాంధ్ర ప్రాంతాల్లో మరో రెండు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచనలు జారీ చేసింది.




**హైదరాబాద్, సెప్టెంబర్ 25, సమయం ప్రతినిధి :** గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహా గణపయ్య చేరుకున్నారు. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ క్రేన్ నంబర్ – 4 దగ్గర పంచముఖ సంకట హర మహా గణపతిని నిమజ్జనం చేశారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గంగమ్మ ఒడికి చేర్చారు. లంబోదరుడిని చూడటానికి భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తుల రద్దీ నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్త జన సంద్రంగా ఆ ప్రాంతంమొత్తం మారింది. సెక్రటేరియట్ సౌత్ ఈస్ట్ మార్గంలో భక్తులు కిక్కిరిసి పోయారు.

### అప్పర్ ట్యాంక్ బండ్‌పై కోలాహలంగా నిమజ్జనోత్సవాలు

కాగా, అప్పర్ ట్యాంక్ బండ్‌పై అత్యంత కోలాహలంగా వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాలు కొనసాగుతున్నాయి. జంట నగరాల నుంచి భారీగా విగ్రహాలు తరలివస్తున్నాయి. 12 క్రేన్ల ద్వారా నిమజ్జనం ప్రక్రియ కొనసాగుతోంది. భద్రతకోసం పోలీస్ కంట్రోల్ రూం ద్వారా 58 సీసీటీవీ కెమెరాలతో పోలీసులు పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం పూర్తి అయ్యేలా అప్పర్ ట్యాంక్ బండ్‌పై భారీగా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ప్రతి క్రేన్ వద్ద ఒక ఎస్ఐ, ఐదుగురు పోలీస్ సిబ్బందితో పర్యవేక్షిస్తున్నారు. నిమజ్జన ప్రాంతాల్లో రంగంలోకి 25 క్రైమ్ టీమ్స్, 10 షీ టీమ్స్ బృందాలు విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 479 విగ్రహాల నిమజ్జనం పూర్తి అయ్యాయని పోలీసులు పేర్కొన్నారు.




**సమయం ప్రతినిధి:** గ్రామీణ తెలంగాణలో శాశ్వత మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క అన్నారు. వరంగల్‌లో జరిగిన ప్రెస్ మీట్ లో ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ రహదారుల అభివృద్ధిలో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (HAM) రోడ్లు గేమ్‌చేంజర్‌గా నిలవాలన్నారు. వేల కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారులను అభివృద్ధి చేయబోతున్నామని.. తొలిదశలో 7,448 కి.మీ మేర రోడ్లను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. దసరా నాటికి అన్ని ప్యాకేజీల్లో పనులు ప్రారంభం కావాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా పనులను వేగంగా పూర్తి చేసి గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రహదారి సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. ప్రతి ఆవాసం నుంచి రాష్ట్ర రాజధానికి రహదారి సౌకర్యం కల్పించడమే నావీ విధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. ఎల్‌నినో నేపథ్యంలో నీటి భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సీతక్క అధికారులను ఆదేశించారు. ప్రతి జలాశయంలో నీటి మట్టాలను ప్రతిరోజూ పర్యవేక్షించి.. ఏడాది తాగునీటి అవసరాలను నిర్ధారించాలని సూచించారు. మిషన్ భగీరథలో సమస్యాత్మకంగా ఉన్న 86 జనావాసాల్లో నీటి సరఫరాను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలని అన్నారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పొలానికి పంట కుంట, ప్రతి గ్రామానికి ఊటకుంట ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. VB-GRAM G లక్ష్యం కూలీకి పని, గ్రామానికి శాశ్వత ఆస్తి అని పేర్కొన్న మంత్రి.. అక్టోబర్ 2న జరిగే గ్రామసభల్లో వచ్చే ఏడాది చేపట్టాల్సిన పనులను ప్రజలతో చర్చించి ఆమోదించాలని తెలిపారు.

## వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలను సమగ్రంగా రూపొందించాలి

### స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 25:** గ్రామాల సమగ్ర అభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించి వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలను సమగ్రంగా రూపొందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తొమ్మిది మండలాలకు చెందిన సర్పంచులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్రస్థాయి సిబ్బందికి వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికల రూపకల్పనపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామసభల్లో చర్చించాల్సిన అంశాలు, గ్రామాభివృద్ధికి అవసరమైన పనులు, ప్రభుత్వ పథకాలు, అందుబాటులో ఉన్న నిధులను సద్వినియోగం చేసుకునే విధానాలపై అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా వి.బి.జి. రామ్‌జీ పథకం కింద గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికల్లో పొందుపరచాలని సూచించారు. అక్టోబర్ 1 నుంచి 2027 జూన్ వరకు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాల సమగ్ర అభివృద్ధికి దోహదపడే పనులను గుర్తించి ప్రణాళికల్లో చేర్చాలని తెలిపారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో నీటి భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని అదనపు కలెక్టర్ సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేలా అవసరమైన ప్రాంతాల్లో చెక్‌డ్యామ్‌లు, ఫామ్ పాండ్లు, పర్కొలేషన్ ట్యాంకులు, రీచార్జ్ నిర్మాణాలు, రీచార్జ్ బోర్‌వెల్లు, సోక్‌పిట్లు వంటి పనులను చేపట్టాలని తెలిపారు. నీటి వనరుల సంరక్షణ, భూగర్భ జలాల పునఃపూరణ, వ్యవసాయంలో నీటి వినియోగ సామర్థ్యం పెంపు, పంటల వైవిధ్యీకరణ వంటి అంశాలను ప్రణాళికల్లో చేర్చాలని సూచించారు. గ్రామాల వారీగా వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలను ఈ నెల 30వ తేదీలోగా సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు. నీటి సంరక్షణతో పాటు మౌలిక వసతుల కల్పన, జీవనోపాధి అభివృద్ధి, వర్షాభావ పరిస్థితుల నివారణకు ప్రణాళికల్లో ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. పాఠశాలలు, గ్రామ పంచాయతీ, వి.ఓ. భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, ప్రహరీ గోడలు, డ్రైనేజీలు, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు తదితర మౌలిక అవసరాలను గ్రామాల వారీగా గుర్తించి ప్రణాళికల్లో పొందుపరచాలని సూచించారు. అక్టోబర్ 2న నిర్వహించనున్న గ్రామసభల్లో గ్రామాభివృద్ధికి సంబంధించిన అంశాలపై సమగ్రంగా చర్చించి అవసరమైన తీర్మానాలు చేయాలని అన్నారు.



గ్రామం అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొంటూ, గ్రామాభివృద్ధిలో సర్పంచులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన నిధులు, సౌకర్యాలను పొందేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని తెలిపారు. పరిష్కరించాల్సిన సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వ స్థాయిలో అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లాను అభివృద్ధిలో ముందంజలో నిలిపేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి వేణుగోపాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద నాయక్, మిషన్ భగీరథ ఇంట్రా కార్యనిర్వహణ ఇంజనీర్ జయాబాయి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శివానంద స్వామి తమ శాఖల ద్వారా అమలు చేస్తున్న పథకాలు, చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఆయా శాఖల పరిధిలో గ్రామాలకు అవసరమైన పనులను గుర్తించి ప్రణాళికల్లో చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్‌పీసీఈఓ, ఇన్‌చార్జి డీపీఓ వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీఓ నరసింహులు, జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎఫ్ఏలు, టీఏలు, వి.బి.జి. రామ్‌జీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## మానవుడిక మహనీయుడూ మాననీయుడు కాదా?

ప్రకృతిని జయించటం, అనుభవించటం అన్నవి మనిషి ఆలోచనలను 250 ఏళ్లపాటు తీవ్రంగా ప్రభావితం చేశాయి. చరాచర ప్రపంచంతో పాటు సమస్త జంతు, వృక్ష సంపద మనుషుల అవసరాలు, ఆనందాల కోసమే ఉందన్నట్లుగా పరిగణించటం పారిశ్రామిక విప్లవం తర్వాత కనీవినీ ఎరగని రీతిలో ఊపందుకుంది. హద్దులూ, అవధులూ లేకుండా మనిషి జైత్రయాత్ర ప్రకృతిపై సాగుతూనే ఉంటుందని ఎందరో శాస్త్రవేత్తలూ తత్వవేత్తలూ ప్రగతి గానాలు చేశారు. మరెందరో కవులూ, కళాకారులూ వాటితో గొంతు కలిపారు. 'మానవుడే మహనీయుడు.. శక్తియుతుడు.. యుక్తిపరుడు.. మానవుడే మాననీయుడు.. జీవకోటి సర్వములో శ్రేష్ఠతముడు.. మానవుడే మహనీయుడు.. మహనీయుడు..' అంటూ ప్రముఖ కవి ఆరుద్ర 1972లో బాలభారతం సినిమాలో రాసిన పాట దీన్నే గుర్తుచేస్తుంది. 'గ్రహరాశులనధిగమించి.. ఘనతారల పథం నుంచి.. గగనాంతర రోదసిలో.. గంధర్వగోళతతుల దాటి.. బొందితో భువికి తిరిగి రాగలిగే' ఘనశక్తి మనిషికే ఉందని గొప్పగానూ శ్లాఘించారు. 'మెదడన్నది మనకున్నది.. అదిసరిగా పనిచేస్తే.. విశ్వరహః పేటికా విపాటన జరగక తప్పదు' అని శ్రీశ్రీ మానవమేధ ఔన్నత్యానికీ, ఆధిక్యానికీ అక్షరరూపమిచ్చారు. సృష్టికి ప్రతిసృష్టి చేసే శక్తి మనిషి మెదడుకు ఉండటమే అద్భుతమని అనుకున్న దశ నుంచీ ఆ ప్రతిసృష్టిని చూసి భయపడే స్థితికి మనం చేరుకోవటం ఇప్పుడు సవాల్‌గా పరిణమించింది. కృత్రిమమేధ (ఏఐ)తో మనిషి తన ఆధిపత్యానికి తనే మరణశాసనం రాసుకుంటున్నట్లుగా భావించే విపరీత వ్యాఖ్యానాలతో పాటు ఆర్థికరంగంలో అది చూపించే ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఆ సవాల్‌ను అంత తేలికగా తీసుకోలేం. ఇప్పటివరకూ మనం శాస్త్రసాంకేతిక రంగంలో ఎన్నో విప్లవాలను చూశాం. అవన్నీ మనుషుల సౌకర్యాలను, సంతోషాలను గణనీయంగా పెంచి అంతేస్థాయిలో పర్యావరణాన్ని దెబ్బతీశాయి. అందుకే 1970ల నుంచి పర్యావరణ చైతన్యం క్రమేపీ బలపడి అభివృద్ధి పేరుతో, ప్రకృతిని జయించటం పేరుతో దేన్నైనా చేయొచ్చనే ధోరణికి బంధనాలు వేయటానికి ఎన్నో విధానాలు రూపొందాయి. మనుషులు భద్రంగా బతకటానికి అవసరమైన పర్యావరణం ఉండాలంటే పారిశ్రామిక యుగం కంటే ముందున్న భూ ఉష్ణోగ్రతలను రెండు డిగ్రీల సెల్సియస్ మించకుండా చూడాలని ప్యారిస్ వాతావరణ ఒప్పందం తీర్మానించటానికి కూడా ఈ నేపథ్యమే కారణం. గతంలోని శాస్త్ర సాంకేతిక విప్లవాలు ఏవీ మనుషుల నియంత్రణను దాటిపోయే ప్రమాదాన్ని తీసుకురాలేదు. అపరిమిత లాభాల కోసమూ, కంపెనీలు, దేశాల మధ్య ఆధిపత్యం కోసమూ శాస్త్రసాంకేతిక రంగాలను దుర్వినియోగం చేసి యుద్ధాలనూ పర్యావరణ విధ్వంసాలనూ కొనితెచ్చినా, అవసరమనుకున్నప్పుడు ఆ రంగాలను అదుపులో పెట్టగలిగే పరిస్థితి ఎంతో కొంత ఉండేది. ఏఐని అలా అదుపులో ఉంచే పరిస్థితి ఉండదనీ మనిషి అదుపాజ్ఞలను అది తోసిపుచ్చి, స్వయం నిర్ణయాలను తీసుకునే తీవ్ర ప్రమాదాన్ని కొట్టిపారేయలేమనే వ్యాఖ్యానాలు బలంగా వినపడుతున్నాయి. ఏఐ రంగంలో అగ్రగాములుగా ఉన్న నిపుణులు, కంపెనీల అధినేతల నుంచే ఇలాంటి భయాలు వెల్లడికావటంతో అంతర్జాతీయస్థాయిలో ఏఐపై నియంత్రణ ఉండాలనే భావన బలం పుంజుకుంటోంది. మానవ అస్తిత్వానికీ, మనిషి సహజశక్తులకూ భంగం కలగని రీతిలో ఏఐని కట్టడిచేయటానికి ప్రయత్నాలు జరగకపోతే కలిగే అనర్థాలు చాలా ఉంటాయి. ఇప్పటికే ఏఐ పేరుతో ఉద్యోగాలు ఊడిపోతున్నాయి. అగ్రశ్రేణి కంపెనీలే వరసపెట్టి లేఆఫ్‌లు ప్రకటిస్తున్నాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) అంచనా ప్రకారం 40శాతం ఉద్యోగాలు (మరో అంచనా ప్రకారం అది 60శాతం వరకూ ఉండొచ్చు) ఏఐతో ప్రభావితం అయ్యే అవకాశం ఉంది. డేటా ఎంట్రీ, కస్టమర్ సర్వీస్, సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్, లా, అకౌంటింగ్, మెడిసిన్, టీచింగ్, జర్నలిజం, గ్రాఫిక్ డిజైనింగ్-- కంటెంట్ క్రియేషన్, ట్రాన్స్‌లేషన్ లాంటి రంగాల్లో ఉద్యోగాల కోతలు తీవ్రంగా ఉంటాయి. టీచింగ్, జర్నలిజం లాంటి రెండు రంగాలను ఉదాహరణగా తీసుకుంటే ఏఐ ప్రభావం ఎలా ఉంటుందో తేలికగానే ఊహించొచ్చు. ఒక్క ఏఐ ట్యూటర్ వేలమంది టీచర్లు చేసే పనిని అతి తేలికగా చేయగలదు. విద్యార్థుల స్థాయినీ, వారు చేసే తప్పులనూ, వారు లేవనెత్తే ప్రశ్నలనూ నిమిషాల్లో గుర్తించగలదు. ప్రతి విద్యార్థికి సంబంధించి అనుసరించాల్సిన వ్యూహాన్ని స్పష్టం చేయగలదు. ఇక జర్నలిజానికి అవసరమైన అనేక విషయాలను సంగ్రహపరచి పాఠకులకు అర్థమయ్యేరీతిలో కథనాలను తేలికగా తయారు చేస్తుంది. క్రీడా విశేషాలూ, ఫైనాన్షియల్ మార్కెట్లూ, ఆర్థిక వ్యవస్థకూ సంబంధించిన న్యూస్‌నూ, వీడియోలను అనుసరించి కావాల్సిన భాషల్లో లిఖిత రూపంలో ఇవ్వటమూ, అనువాదాన్ని అందించటమూ, వివిధ పరిణామాలనూ సంక్షిప్త-దీర్ఘవార్తలుగా తీర్చిదిద్దటమూ, గణాంకాలనూ-డేటానూ అవసరాలకు తగ్గట్టుగా విశ్లేషించి-వర్గీకరించటమూ నిమిషాల్లో చేయగలగటంతో జర్నలిజంలో మానవవనరుల వినియోగంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఉద్యోగాలను దెబ్బతీయటం ఏఐ ఏ స్థాయిలో చేయగలదో ఇంకా పూర్తిగా స్పష్టం కావటం లేదు. గతంలోనూ కొత్త సాంకేతిక పరిజ్ఞానం వచ్చినప్పుడు దాని ప్రభావాన్ని అంచనా వేయటానికి చాలాకాలమే పట్టింది. క్యాపిటలిజంగా మనం పిలిచే ఆర్థిక వ్యవస్థలో మార్పులు అనూహ్యంగా వస్తాయి. మలుపులు కూడా అనూహ్యంగా ఉంటాయి. దాని సాధారణ స్వరూపమూ, నడవడిక గురించి అవగాహన ఉన్నా నిర్దిష్టంగా జరిగే మార్పులు ఎన్నో అంశాలపై ఆధారపడి ఉంటాయి. అయితే ఒకటి మాత్రం స్పష్టం. క్యాపిటలిజాన్ని దాని మానాన దాన్ని వదిలివేస్తే విపరీత పర్యావరణ విధ్వంసానికీ, గుత్తాధిపత్యానికీ దారితీస్తుంది. ఏఐ కూడా ఇప్పుడు అదే బాటలో నడుస్తోంది. ఏఐకి ఎంతో కీలకమైన డేటా సెంటర్లు పర్యావరణంపై కలగచేసే ప్రతికూల వాతావరణం గురించి ఇప్పటికే పెద్ద చర్చ మొదలైంది. అమెరికాలోనే వాటిపై వ్యతిరేకత ఆరంభమైంది. కొన్నిచోట్ల స్థానిక ప్రభుత్వాలు వాటి ఏర్పాటును వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేస్తున్నాయి. రిపబ్లికన్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనే ఇది కనపడుతోంది. ఇక ఏఐతో గుత్తాధిపత్యం మరింతగా పెరిగే అవకాశాన్ని ఏ విధంగానూ కొట్టేయలేం. ఏఐకి సంబంధించిన అయిదు పెద్ద కంపెనీలు ఈ ఏడాదిలో ఇప్పటివరకూ 240 బిలియన్ డాలర్లను (రూ.23 లక్షల కోట్లు) సేకరించాయి. చరిత్రలో ఒక అయిదు కంపెనీలు స్వల్పకాలంలో ఇంత పెద్ద మొత్తంలో నిధుల సమీకరణ చేయలేదు. గుత్తాధిపత్యంతో మార్కెట్‌పై అదుపు సంపాదించటానికి ఎంతగా అవకాశం ఉన్నా అది అన్ని సందర్భాల్లోనూ అనుకున్నట్లుగా సాగదు. పెద్ద కంపెనీల మధ్య పోటీని పూర్తిగా నివారించలేం. క్యాపిటలిజంలో ఉన్న మౌలిక లక్షణమే అది. కంపెనీలు గుత్తాధిపత్యంతో సంతృప్తి చెందితే ఐటీ విప్లవం వచ్చేది కాదు. ఈనాటి ఏఐ అభివృద్ధి అయ్యేదీ కాదు. అపరిమిత లాభాపేక్ష కొత్త సాంకేతిక పరిజ్ఞానాలను సృష్టిస్తుంది. దీనికితోడు కొత్తవి సృష్టించాలనే మనుషుల తపన వల్ల ఏదో ఒక స్థాయిలో కొత్త సాంకేతిక పరిజ్ఞానాలు ఊపిరిపోసుకుంటూనే ఉంటాయి. గుత్తాధిపత్యం అంటే పెద్ద కంపెనీల మధ్య సమానత్వం ఉన్నట్లు కాదు. వాటి మధ్య ఉన్న అసమానతలు కూడా పోటీకీ, అధిక లాభాన్వేషణకూ దారితీస్తాయి. కొత్త సాంకేతిక పరిజ్ఞానం అనే అస్త్రంతోనే ప్రత్యర్థి కంపెనీలపై పైచేయి సాధించటానికి ప్రయత్నిస్తాయి. అయితే ఈ పోటీ ఏఐ యుగంలో హద్దులు దాటితే సృష్టికర్తల నియంత్రణే జారిపోయే ప్రమాదం ఉంటుంది. అదంటూ జరిగితే ఏ విపరిణామాలు తలెత్తుతాయో ఇప్పటికిప్పుడు ఊహించటం కష్టం. దీన్ని దృష్టిలో ఉంచుకునే ప్రముఖ భౌతికశాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ మనుషులు సృష్టించిన ఏఐ మానవ నియంత్రణలో ఉంటుందా? అని 2014లోనే ప్రశ్నించారు. కంప్యూటర్లు, ఇంటర్నెట్ ప్రధానంగా మనం ఇచ్చే ఆదేశాలను అమలుచేసేవనీ, ఏఐ మనుషుల నిర్ణయాలనే ప్రభావితం చేయగలదంటూ యూవాల్ నోవా హరారి చేసిన వ్యాఖ్యానంలో నిజం లేకపోలేదు. ఏఐ మీద విపరీతంగా ఆధారపడే మనం సమాచారాన్ని మొత్తం ఏఐ గుప్పిట్లో పెడుతున్నాం. మన భయాలు, కోరికలు, బలహీనతలు, భావోద్వేగాలను అర్థంచేసుకుని మన నిర్ణయాలను ప్రభావితం చేసే స్థాయికి ఏఐ చేరుకుంటోందనీ దీన్ని 'హ్యాకింగ్ హ్యూమన్స్'గా హరారి వ్యాఖ్యానించారు. మనుషులు తమ నిర్ణయాధికారాన్ని ఏఐకి అప్పగించుకుంటూ పోతే క్రమేపీ మేధోపరమైన వివేచనా శక్తులనే కోల్పోతారన్న భయాన్నీ హరారే వ్యక్తంచేశారు. మనుషులతో కాకుండా ఏఐతో ఉద్వేగ సంబంధాలను ఏర్పరచుకుంటే మానవ సామాజిక అస్తిత్వమే బలహీనపడుతుంది. సజీవ మనుషులతో సంబంధాలు సన్నగిల్లితే కళలూ, సాహిత్యాలూ చిన్నబోతాయి. దీంతో మానవ సారమే పలచబడిపోతుంది.

## వడ్డెర బస్తీలో కాలిన గుడిసెను పరిశీలించిన మాజీమంత్రి





మహబూబ్ నగర్ : మోతినగర్ వడ్డెర బస్తీ లో కాలిన గుడిసెను మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పరిశీలన చేశారు. పేదల గుడిసెలు ఎవరు తీయలేరు.. ఎవరికి డబ్బులు ఇవ్వొద్దు.. ఎవరైనా అడిగితె అధికారులకు చెప్పండి. మీ గుడిసేల జోలికి వస్తే మేము పోరాటం చేస్తాము. మీరు చెట్ల కింద బతుకుతుంటే గుడిసెలు వేసుకునేందుకు మీకు స్థలం బీ ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో మేము ఇచ్చాము. ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వమని వచ్చిన అధికారులను కోరండి. మా ప్రభుత్వం వచ్చిన వెంటనే ఇక్కడే ఇండ్లు నిర్మాణం చేస్తాము.కాలిన గుడిసెకు సొంత డబ్బులతో రేకులు వేయించి ఇస్తామని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ హామీ ఇచ్చారు. గుడిసెలు కాలిన వెంటనే స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు వచ్చి సహాయం అందించారు.వడ్డెర బస్తిలో లైట్స్.. ఇతర సమస్యలు ఉన్నాయి.. వాటిని పరిష్కారం చేసేందుకు మా పార్టీ కార్పొరేటర్లు అధికారులను కలిసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ముడా మాజీ చైర్మన్ వెంకన్న, కార్పొరేటర్ మధు మోహన్, సీనియర్ నాయకులు నరేష్, సిద్ధిక్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్పీతో కలిసి నిమజ్జన చెరువు ప్రాంతాన్ని పరిశీలించిన ఎస్పీ





వనపర్తి : ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, గణేష్ నిమజ్జనం చివరి రోజు డీఎస్పీ తో కలిసి నల్లచెరువు నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలించి, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. టౌన్ ఎస్సై హరిప్రసాద్, రూరల్ ఎస్సై రుషికేశ్ మరియు పోలీసు సిబ్బందికి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భక్తులకు పటిష్ఠ భద్రత కల్పిస్తూ నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు. ఇన్ని రోజులుగా పటిష్టమైన బందోబస్తు నిర్వహించిన పోలీసు సిబ్బందిని అభినందిస్తూ, చివరి రోజు కూడా అదే అప్రమత్తతతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఉత్సవ కమిటీలు నిబంధనలు పాటిస్తూ, పూజలు త్వరగా ముగించి వెలుతురు ఉండగానే విగ్రహాలను తరలించాలని, డీజేలు, బాణాసంచా విషయంలో నిబంధనలు పాటించాలని సూచించారు. నిమజ్జన ప్రాంతంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పర్యవేక్షించాలని సంబంధిత సిబ్బంది, కాంట్రాక్టర్‌కు సూచిస్తూ, మత సామరస్యంతో నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఎస్పీ కోరారు.

## ఫోక్సో చట్టం 2012 పై అవగాహన సదస్సు : సీనియర్ సివిల్ జడ్జి స్వాతి మురారి




మహబూబాబాద్ జిల్లా (సెప్టెంబర్ 25 వేకువ సమయం ప్రతినిధి): బాలబాలికలపై జరుగుతున్న లైంగిక ఆకృత్యాలను అరికట్టడానికి, వారికి సురక్షితమైన మరియు గౌరవప్రదమైన బాల్యాన్ని అందించడానికి పోక్సో చట్టం అత్యంత కఠినమైన నిబంధనలతో అమలవుతోందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి స్వాతి మురారి స్పష్టం చేశారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో (KGBV) నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో న్యాయమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ.. లింగభేదాలకు తావులేకుండా 18 సంవత్సరాల లోపు వయసున్న బాలబాలికలందరికీ ఈ చట్టం పూర్తి చట్టబద్ధమైన రక్షణ కల్పిస్తుందన్నారు. ఎలాంటి వేధింపులు ఎదురైనా విద్యార్థినులు భయపడకుండా, సిగ్గుపడకుండా వెంటనే తమ తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు లేదా ఇంట్లోని పెద్దలకు తెలియజేయాలని ఆమె స్పష్టం చేశారు. వేధింపుల గురించి ఫిర్యాదు చేసిన బాధితుల వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ బయటపెట్టరని, వారి గుర్తింపును చట్టప్రకారం పూర్తిగా గోప్యంగా ఉంచుతారని విద్యార్థులకు ధైర్యం కల్పించారు. బాలలపై ఎక్కడైనా లైంగిక వేధింపులు జరిగినట్లు గమనిస్తే... ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, వైద్య సిబ్బంది లేదా స్థానికులు తక్షణమే పోలీసులకు లేదా 'చైల్డ్‌లైన్' కు ఫిర్యాదు చేయడం చట్టరీత్యా తప్పనిసరని, నేరాన్ని దాచిపెట్టడం లేదా ఉపేక్షించడం కూడా శిక్షార్హమైన నేరమన్నారు. బాధితుల గుర్తింపును వెల్లడించేలా వారి పేర్లు, ఫొటోలు, పాఠశాల లేదా నివాస వివరాలను సోషల్ మీడియా లేదా ఇతర ప్రసార మాధ్యమాలలో బహిర్గతం చేయడం తీవ్ర నేరమన్నారు. బాధితులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత లీగల్ ఎయిడ్ న్యాయవాదుల సేవలు అందించబడతాయని, అలాగే బాధితుల పరిహార పథకం కింద తగిన ఆర్థిక, వైద్య, మానసిక సహాయం లభిస్తుందని తెలియచేశారు. విద్యార్థులకు న్యాయస్థానాల పనితీరుపై ప్రత్యక్ష అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో, ఆసక్తి గల విద్యార్థులను ఒకరోజు కోర్టు ప్రాంగణానికి తీసుకురావాలని న్యాయమూర్తి పాఠశాల ప్రత్యేకాధికారికి సూచించారు. అనంతరం అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ వి.రాజ్ కృష్ణ మాట్లాడుతూ.. బాల్య వివాహాలు సామాజిక దురాచారాలని, ఆర్థిక లేదా ఇతర ఇబ్బందుల వల్ల బాల్యాన్ని దూరం చేసుకోవద్దని హితవు పలికారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటివల్ల జరిగే అనర్థాలను వివరించారు. బాల్య వివాహాలు నిర్వహించిన వారు, ప్రోత్సహించిన వారు కూడా నేరస్తులుగా పరిగణించబడతారన్నారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అందించే ఉచిత న్యాయ సేవలను వివరిస్తూ, న్యాయ సలహాల కొరకు టోల్ ఫ్రీ నెంబర్ 15100 ను సంప్రదించవచ్చని సూచించారు.అయోధ్యపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పవన్ కుమార్ మాట్లాడుతూ.. సాంకేతికతను సరైన రీతిలో వినియోగించుకోవాలని, సోషల్ మీడియా దుర్వినియోగం వల్ల బాలికలు సైబర్ నేరగాళ్ల వలలో పడి అఘాయిత్యాలకు గురవుతున్నారని, తద్వారా తమ భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారని హెచ్చరించారు. బాలికల భవిష్యత్తు ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, సర్వైకల్ క్యాన్సర్ నివారణ కోసం జిల్లాలో ఇటీవల చేపట్టిన 'హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ డ్రైవ్' ను విజయవంతంగా పూర్తి చేసినట్లు ఈ సందర్భంగా తెలియచేశారు. వసతి గృహాల్లో ఉండే విద్యార్థినులు తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి సునీత, బోధనా సిబ్బంది, గూడూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్య బృందం, మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

## వికసిత భారతానికి దీన్‌దయాళ్ దారి

సమయం ప్రతినిధి : భారత రాజకీయ చరిత్రలో కొందరు నాయకులు వారు నిర్వహించిన పదవుల ద్వారా గుర్తుండిపోతారు. మరికొందరు తమ ఆలోచనలు, సిద్ధాంతాలు, జీవన విలువలతో తరతరాలకు మార్గదర్శకులుగా నిలుస్తారు. పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ రెండో కోవకు చెందినవారు. 1916 సెప్టెంబర్ 25న జన్మించిన దీన్‌దయాళ్‌జీ చిన్ననాటి నుంచే అనేక కష్టాలను ఎదుర్కొన్నారు. జీవితంలో ఎన్నో ఒడుదుడుకులు ఎదురైనా ఆయన ఎక్కడా కుంగిపోలేదు. కష్టాలను అధిగమిస్తూ దేశసేవే తన జీవిత ధ్యేయంగా బతికారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ద్వారా సామాజిక సేవలో ప్రవేశించారు. 1953 నుంచి 1968 వరకు జనసంఘ్‌లో వివిధ కీలక బాధ్యతలను నిర్వహిస్తూ పార్టీని దేశవ్యాప్తంగా బలోపేతం చేశారు. కేవలం సిద్ధాంతాలను పదేపదే వల్లించడం వల్ల సమాజం మారదు. వాటిని ఆచరణలో పెట్టినప్పుడే అవి ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువస్తాయి. సంఘ్ ఏ కార్యానికి తనను నియమించిందో, దానికే సంపూర్ణంగా అంకితమై పనిచేశారు. స్వాతంత్ర్యానంతరం భారతదేశం పాశ్చాత్య దేశాల సిద్ధాంతాలను యథాతథంగా అనుసరించకుండా భారతీయ జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయం, సమాజ స్వభావానికి అనుగుణంగా దేశాభివృద్ధి జరగాలని ఆయన ఆకాంక్షించారు. క్యాపిటలిజం, కమ్యూనిజం వంటి సిద్ధాంతాల్లోని పరిమితులను అధిగమిస్తూ, వ్యక్తి-సమాజం-ప్రకృతి-పరమాత్మ మధ్య సజీవ సమన్వయాన్ని ప్రతిపాదించిన సమగ్ర భారతీయ ఆలోచనా విధానమే ఏకాత్మ మానవతావాదం. దీన్‌దయాళ్‌జీ దృష్టిలో అభివృద్ధి అంటే కేవలం సంపద పెరగడం కాదు. మనిషి శరీరం, మనసు, బుద్ధి, ఆత్మ-- అన్ని కోణాల్లో సమగ్రాభివృద్ధి చెందాలి. వ్యక్తి అభివృద్ధి... కుటుంబం, సమాజం, దేశాభివృద్ధితో అనుసంధానమై ఉండాలి. ప్రకృతిని దోచుకోవడం కాదు, ప్రకృతితో సమన్వయంగా జీవించడం ఆయన ఆలోచనలో ముఖ్యమైన అంశం. అందుకే నేటి ప్రపంచం ఎదుర్కొంటున్న పర్యావరణ సంక్షోభం, సామాజిక అసమానతలు, ఆర్థిక అసమతుల్యతల నేపథ్యంలో ఏకాత్మ మానవతావాదం మరింత ప్రాధాన్యంగా మారింది. ఆధునిక సాంకేతికత, ఆర్థిక ప్రగతి అవసరమే. అయితే వాటితో పాటు మానవ గౌరవం, సామాజిక బాధ్యత, ప్రకృతి పరిరక్షణ, భారతీయ విలువలు కూడా ముందుకు సాగాలి. సమాజంలోని అత్యంత వెనుకబడిన వ్యక్తి అభ్యున్నతి సాధించినప్పుడే దేశాభివృద్ధి సంపూర్ణమవుతుందని దీన్‌దయాళ్‌జీ విశ్వసించారు. అందుకే 'అంత్యోదయ' ఆయన ఆలోచనా విధానంలో అత్యంత కీలకమైన భావనగా నిలిచింది. సమాజంలోని ప్రతి వర్గానికి సమాన అవకాశాలు లభించాలి. అభివృద్ధి ఫలాలు చివరి వ్యక్తి వరకు చేరాలి. ఇదే అంత్యోదయ స్ఫూర్తి. నేడు దేశాభివృద్ధిలో పేదల సంక్షేమం, సామాజిక సాధికారత, స్వావలంబన, మౌలిక సదుపాయాల విస్తరణ, చివరి వ్యక్తికి ప్రభుత్వ ప్రయోజనాలు చేరడం వంటి అంశాలకు ప్రాధాన్యం లభించడం దీన్‌దయాళ్‌జీ ఆలోచనల సమకాలీనతను తెలియజేస్తోంది. దీన్‌దయాళ్‌జీ రాజకీయ హుందాతనానికి నిదర్శనాలైన కొన్ని సంఘటనలున్నాయి. 1967లో వివిధ రాష్ట్రాల్లో రాజకీయ సమీకరణాలు మారుతున్న సమయంలో భిన్న సిద్ధాంతాలకు చెందిన పార్టీలతో కలిసి పనిచేశారు. కమ్యూనిస్టులతో రాజకీయ పోటీ ఉన్నా, వారిని శత్రువులుగా చూడకుండా, ఉన్నతమైన రాజకీయ సంస్కృతిని ప్రదర్శించారు. దీన్‌దయాళ్‌జీ కేవలం సిద్ధాంతకర్త మాత్రమే కాదు. వేలాది కార్యకర్తలకు మనోధైర్యం నింపిన గొప్ప నాయకుడు. విమర్శలు ఎదురైనప్పుడు కుంగిపోకుండా, వాటినే మన బలంగా మార్చుకోవాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చేవారు. తాష్కెంట్ ఒప్పందం తరువాత జనసంఘ్ సభలో కార్యకర్తలను సముదాయించిన తీరు ఆయన నాయకత్వంలోని హుందాతనాన్ని, కార్యకర్తల పట్ల ఉన్న అనుబంధాన్ని ప్రతిబింబిస్తుంది. నేటి రాజకీయ వాతావరణంలో చిన్న విషయాలు కూడా తీవ్ర వివాదాలకు దారితీస్తున్నాయి. కానీ దీన్‌దయాళ్‌జీ కాలంలో రాజకీయ ప్రత్యర్థితో కూడా ఒక నైతిక బాధ్యతతో వ్యవహరించే సంస్కృతి ఉండేది. ఆర్గనైజర్ పత్రికలో ఆనాటి హోం మంత్రి చవాన్‌ను ఉద్దేశించి గాడిద రూపంలో కార్టూన్ వచ్చినప్పుడు ఆ విధంగా కార్టూన్ వేయాల్సింది కాదన్నారు.





# రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యం..

## పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తాం : దేవరకద్ర ఎమ్మెల్యే +వీ=

దేవరకద్ర : శుక్రవారం నాడు తీలేర్ పంప్‌హౌస్‌ను దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (GMR) పరిశీలించి, నీటి విడుదలకు సంబంధించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ.. నేడు ఉదయం ఉంద్యాల పంప్‌హౌస్ నుంచి అధికారులు రెండు మోటార్లను ఆన్ చేసి కోయిల్‌సాగర్‌కు నీటిని విడుదల చేశారని తెలిపారు. కష్టకాలంలో తెలంగాణ రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన విజ్ఞప్తికి కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పెద్ద మనసుతో జూరాలకు నీటిని విడుదల చేయడానికి సహకరించినందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున, ముఖ్యంగా పాలమూరు జిల్లా రైతుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. పాలమూరు రైతుల సాగునీటి కష్టాలు తమకు తెలుసని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని వచ్చే సంవత్సవం జూన్ నాటికి (పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు) కరివేన వరకు పూర్తి చేసి రైతుల పొలాలకు సాగునీరు అందిస్తామని తెలియజేశారు. పదేళ్ల అధికారంలో ఉన్న కెసిఆర్ రోజా ఇంట్లో చేపల పులుసు తిని రాయలసీమను రతనాల సీమ చేస్తానని ప్రకటించి పాలమూరు రంగారెడ్డి ని పూర్తి చేయలేదని గత ప్రభుత్వ తీరుపై విరుచుకుపడ్డారు. పాలమూరు ఎత్తిపోతల పథకం గతంలోనే పూర్తయి ఉంటే ఈరోజు పాలమూరు జిల్లాకు సాగునీటి విషయంలో గడ్డు పరిస్థితులు వచ్చే ఉండేది కాదని పేర్కొన్నారు. ఇటీవల వనపర్తిలో నిర్వహించిన సమీక్షలో సాగునీటి పంపిణీపై చర్చించామని, వారాబంది పద్ధతిలో ఆన్-ఆఫ్ సిస్టమ్ ద్వారా రైతులకు నీటిని అందిస్తామని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు తర్వాత ప్రారంభమైన కాళేశ్వరం ప్రాజెక్టు పనులను గత ప్రభుత్వం పూర్తి చేసింది కానీ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును మాత్రం నిర్లక్ష్యం చేసిందని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (GMR) అన్నారు. పాలమూరు జిల్లా నుంచి గతంలో మంత్రులు, ఎమ్మెల్యేలుగా పనిచేసిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై గట్టిగా ఒత్తిడి తెచ్చి ఉంటే ఆనాడే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు పూర్తయ్యేవని అన్నారు. పాలమూరు ప్రజల ప్రయోజనాల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన సమయంలో ఆనాటి బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు మౌనం వహించి, జిల్లాకు తీవ్ర అన్యాయం చేశారని ఉమ్మడి పాలమూరు జిల్లా బిఆర్ఎస్ మాజీ ప్రజా ప్రతినిధులపై మండిపడ్డారు. పాలమూరు రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ పనులను వేగవంతం చేసిందని తెలిపారు. పాలమూరు రైతులకు గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని సరిదిద్ది, పాలమూరు ముద్దుబిడ్డ శ్రీ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో జిల్లాను సస్యశ్యామలం చేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ తెలియజేశారు.






# మక్తల్ విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిన మంత్రి





మక్తల్ : పట్టణంలో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా మరో ముందడుగు పడింది. పట్టణంలో కరెంటు కోతలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు ఏర్పాటు చేసిన మినీ సబ్‌స్టేషన్‌ను మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించారు. మక్తల్ పట్టణంలో విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ అందించడమే లక్ష్యంగా మినీ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. సబ్‌స్టేషన్ అందుబాటులోకి రావడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, వోల్టేజీ సమస్యలు తగ్గి ప్రజలకు మెరుగైన సేవలు అందనున్నాయని పేర్కొన్నారు.

# షాద్‌నగర్‌లో ఘనంగా "నమామి భారతం" కార్యక్రమం



షాద్‌నగర్: షాద్‌నగర్ శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో విద్యా భారతి ఆధ్వర్యంలో "నమామి భారతం" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 150 సంవత్సరాల సామూహిక వందేమాతరం గీతాలాపనను దేశభక్తి భావంతో నిర్వహించారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా సంఘ్ నగర బౌద్ధిక్ శ్రీ కోట్ల కమలాకర్ జీ, అతిథిగా భాగ్యనగర్ విభాగ్ కార్యాకారిణి శ్రీ వర్కాల బాలరాజు పాల్గొన్నారు. పాఠశాల అధ్యక్షులు శ్రీ దొంతు పాండురంగయ్య, సమితి కార్యదర్శి శ్రీ నాగిళ్ల కిషోర్, కమిటీ సభ్యులు, సంఘ్ ప్రతినిధులు, వాసవి క్లబ్ ప్రతినిధులు, ఆచార్యులు, మాతాజీలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. సుమారు 160 మంది కలిసి సామూహికంగా వందేమాతరం గీతాన్ని ఆలపించారు. అనంతరం ముఖ్య వక్త కోట్ల కమలాకర్ జీ వందేమాతరం గీతం గొప్పతనం, చరిత్ర, దేశభక్తిలో దాని ప్రాముఖ్యతపై విద్యార్థులకు స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. దేశభక్తి ఉట్టిపడే వాతావరణంలో కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని పాఠశాల ప్రధానాచార్యులు శ్రీ చిప్పోళ్ళు వీరేష్ కుమార్ తెలిపారు.




## జూరాల నీటి విడుదల ముమ్మాటికి బి.ఆర్.ఎస్ విజయం

### కాంగ్రెస్ పార్టీ ప్రచారం ఫుల్ పనులు నిల్

వనపర్తి : జూరాల ప్రాజెక్టు నుండి రైతాంగానికి నీళ్లు విడుదల ముమ్మాటికి బి.ఆర్.ఎస్ విజయం అని జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్,జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ అన్నారు. పంటలు ఎండి రైతాంగం ఆగం అయిపోతుంటే చలించిన నిరంజన్ రెడ్డి ప్రత్యక్ష పోరాటం ప్రకటించడంతో దెబ్బకు దిగివచ్చిన రేవంత్ రెడ్డి సర్కార్ జూరాల నీటి విడుదలకు పూనుకున్నదని నిరంజన్ రెడ్డి సూచించిన విధంగా ముందే కర్ణాటక ప్రభుత్వాన్ని ఆశ్రయించి ఉంటే రైతులు నష్టపోయారు కాదని అన్నారు.అవగాహనలేని అజ్ఞాన్ని మేఘారెడ్డి అబద్ధాలతో రైతులను,ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు.ఈ సందర్భంగా గట్టు యాదవ్ వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే చూపిస్తున్న 299టి. ఎం. సిల కేటాయించారు అని చెప్పడం అవగాహనలేని ఆజ్ఞాన్ని మాట్లాడినట్టు ఉందని పరిపాలన అవసరాల కోసం తాత్కాలిక పత్రం అని దుయ్యబట్టారు. కృష్ణా నదిలో తెలంగాణకు క్యాచ్మెంట్ 68శాతం,ఆంధ్రాకు 38శాతం అని అన్నారు.సాయిచరణ్ రెడ్డిపై చర్యలకు డిమాండ్. డి.ఎస్. పి బీమ్ రెడ్డి బినామిగా చలామణి అయి కోట్లు కొల్లగొట్టిన సాయిచరణ్ రెడ్డిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని వాకిటి.శ్రీధర్ డిమాండ్ చేశారు. సాయిచరణ్ రెడ్డి మణికొండ ఇంటిలో ఈరోజు సోదాలు జరిగాయని ప్రభుత్వం స్పందించి నిజానిజాలు వెలికి తీయాలని అన్నారు. ఈ సమావేశములో నందిమల్ల.అశోక్,కురుమూర్తి యాదవ్,గంధం.పరంజ్యోతి,ఎద్దుల. సాయి కుమార్, ఎం.రాజశేఖర్,పెద్దింటి. వెంకటేష్,నాగన్న యాదవ్,బొబ్బిలి.ప్రేమ్ కుమార్,నీలస్వామి,సునీల్ వాల్మీకి,చిట్యాల. రాము తదితరులు పాల్గొన్నారు.

## 5వ వార్డులో సీసీ రోడ్ల ప్రారంభోత్సవం



అమరచింత : తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ, పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ, మత్స్యశాఖ, క్రీడలు మరియు యువజన శాఖల మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశానుసారంగా, TG టాడీ టాపర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ సూచనల మేరకు, అమరచింత మున్సిపాలిటీ మండల కేంద్రంలోని 5వ వార్డు సమీపంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ప్రారంభోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అమరచింత మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ ఎస్. రాధ అరుణ్ కుమార్ గారు పాల్గొని సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, వార్డుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ రహదారుల నిర్మాణం, పారిశుద్ధ్యం, డ్రైనేజీ తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు.నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ సీసీ రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత సిబ్బందిని సూచించారు. రోడ్ల నిర్మాణంతో స్థానిక ప్రజలకు రాకపోకలకు మరింత సౌకర్యం కలగడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గనున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమరచింత మున్సిపాలిటీ కో-ఆప్షన్ సభ్యులు మణెమ్మ డేవిడ్ , మహిపాల్ , దీన్ కుమార్ , సుభాష్ , స్థానిక ప్రజలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేకువ సమయం
శనివారం 26 సెప్టెంబర్ 2026

# పిల్లలకు అందించే ఆహారం, వసతి, సౌకర్యాలపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



మహబూబాబాద్ జిల్లా (సెప్టెంబర్ 25 వేకువ సమయం ప్రతినిధి) : శుక్రవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఇనుగుర్తి మండలం చిన్న ముప్పారం, గూడూరు మండలం మట్టేవాడ గ్రామాలలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చిన్న ముప్పారంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ సవరణ, హియరింగ్స్, రీ సర్వే గురించి తహసిల్దార్, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితా మ్యాపింగ్, మార్పులు, చేర్పులు, కొత్త ఓటరు నమోదు కార్యక్రమాలను ఎన్నికల కమిషన్ సూచించిన ప్రకారం జిల్లాలో షెడ్యూల్ ప్రకారం కొనసాగుతుందని, ఓటరూ జాబితాలో పేర్లు మ్యాపింగ్ కోసం ఇప్పటికే నోటీసులు అందుకున్న వారికి హియరింగ్ నిర్వహించడం జరుగుతుందని అందులో ఎన్నికల కమిషన్ 11 రకాల గుర్తింపు కార్డులను చూపించి మ్యాపింగ్ చేసుకోవాలని తెలిపారు, ఇంకా స్పందించని ఓటరు లను చైతన్య పరిచి మ్యాపింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు, జిల్లాలో 70 గ్రామాలు రీ సర్వేకు ఎంపికైన సర్వే కొనసాగుతుందని, ప్రభుత్వ భూములు, ఆబాది, పట్టా భూములను సర్వే జరుగుతుందని ప్రభుత్వ నిబంధనలు ప్రకారం పక్కాగా సర్వేను కొనసాగించాలని సూచించారు. అనంతరం గూడూరు మండలం, మట్టేవాడ గ్రామంలో ఉన్నా గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలురు) ఆకస్మికంగా తనిఖీ చేసి పిల్లలకు అందిస్తున్న విద్యా బోధనలు, డైట్ మెనూ, యూనిఫార్మ్, టెస్ట్ బుక్కు, తదితర వివరాలను పిల్లలను అడిగి తెలుసుకుని స్వయంగా పరిశీలించి పిల్లలకు యూనిఫామ్ లు అందజేశారు, పిల్లలతో మాట్లాడుతూ వారి యొక్క విద్య సామర్థ్యాలను పరిశీలించారు. పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, పక్కాగా డైట్ మెనూ పాటించాలని, క్రమం తప్పకుండా షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు పిల్లలకు, భోజనం సిద్ధం చేసే సిబ్బందికి నిర్వహించాలని, సిబ్బంది, ఉపాధ్యాయులు, పిల్లల హాజరు వివరాలను వంద శాతం నమోదు అయ్యే విధంగా చూడాలని, టెస్ట్ బుక్కులు, యూనిఫార్ములు అందించాలని, ఇంగ్లీష్ భాష తోపాటు ఇతర సబ్జెక్టులపై క్లుప్తంగా అర్థమయ్యే విధంగా పిల్లలకు డిజిటల్ తరగతులను నిర్వహించాలని, పిల్లలకు అందించే ఆహారం, వసతి, సౌకర్యాలపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట గిరిజన సంక్షేమ శాఖ అధికారి దేశీ రామ్ నాయక్, ఇనుగుర్తి, గూడూరు తహసిల్దార్లు శ్రీనివాస్, నాగ భవాని, సంబంధిత అధికారులు ఉన్నారు.

# గణనాథుని సేవలో ప్రభుత్వ విప్



మహబూబ్ నగర్ : వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పాత పాలమూరులో శివ రామాంజనేయ భక్త సమాజం ఆధ్వర్యంలో ప్రతిష్టించిన శ్రీ గణనాథుని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి దర్శించుకుని, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, భక్తుల సమక్షంలో వినాయక శోభాయాత్రను ఆయన ఘనంగా ప్రారంభించారు. అనంతరం, కిసాన్ నగర్‌లో మై ఇండియా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ వినాయక స్వామి వారిని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలందరిపై విఘ్నేశ్వరుడి కృపాకటాక్షాలు ఉండాలని, నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముడా (MUDA) చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తూరు చంద్రకుమార్ గౌడ్, కార్పొరేటర్ రఘు, ముఖ్య నాయకులు ఎల్లంగారి భరత్ కుమార్, సతీష్ కుమార్, మాల్యాద్రి తదితరులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

# గురుకుల విద్యార్థులకు ప్రభుత్వం మెరుగైన సౌకర్యాలు కల్పిస్తోంది: ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

దేవరకొండ: సెప్టెంబర్ 25 (సమయం ప్రతినిధి) : దేవరకొండ మండలంలోని కొమ్మెపల్లి గ్రామంలోని ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలను ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు మౌలిక వసతులు, భోజన సౌకర్యాలు, యూనిఫాం, పుస్తకాలు ఉచితంగా అందిస్తోందని తెలిపారు. విద్యార్థులు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. పాఠశాల సిబ్బంది కూడా విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. అనంతరం టి పి సి సి ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ యేకుల రాజారావు చైర్మన్ బక్కి వెంకటయ్యను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో ప్రవేశపెట్టిన ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి మళ్లించకుండా ఆ వర్గాల అభివృద్ధి కోసం ఎస్సీ ఎస్టీ నిధులు వారికి అందే విధంగా మీరు రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ఆ వర్గాలకు లబ్ధి చేరి విధంగా కృషి చేయాలని టి పి సి సి ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ యేకుల రాజారావు చైర్మన్ కి విజ్ఞప్తి చేశారు, అనంతరం ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, టీచింగ్, నాన్ టీచింగ్, సిబ్బంది టిపిసిసి ఎస్సి డిపార్ట్మెంట్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ డాక్టర్ యే కుల రాజారావుని పూల బొకే శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డి.ఎస్.పి శ్రీనివాసరావు, సీఐ వెంకటరెడ్డి ఎస్సై, గురుకుల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక వివిధ ప్రజాసంఘాల నాయకులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# బహుజనులపై దాడులు ఆగాలంటే బహుజనులు పాలకులు కావాలి



జోగులాంబ: (జిల్లా కేంద్రం ): అక్టోబర్ 9న బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాదులో జరిగే బహుజన రాజ్యాధికార సమరభేరిని విజయవంతం చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ పార్లమెంట్ ఇంచార్జి మాసన్న జిల్లా అధ్యక్షుడు మణికుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని సంబంధిత గోడపత్రికలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్రం వచ్చి 79 ఏళ్లు పూర్తి చేసుకుని అడుగుపెట్టిన రాజ్యాంగ మమల్నికొచ్చి 76 ఏళ్లు దాటిన ఇంకా దేశంలో అంటరానితన వివక్ష కొనసాగుతూనే ఉన్నాయన్నారు. 85 నుండి 90% ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల శ్రమతో దేశ సంపద పెరుగుతుంటే అగ్రకుల నాయకులు రాజకీయ అధికారాన్ని అనుభవిస్తూ బహుజనులను అణుగదొక్కుతున్నారని సందర్భంగా వారు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా ఈ దాడులు పెరిగాయని.. కోదాడలో కర్ల రాజేష్ లాకప్ డెత్, షాద్నగర్లో ప్రేమ జంట సజీవ దహనం, మెదక్లో మాదిగ యువకుడి గ్రామ బహిష్కరణ, నేరెళ్లలో దళితులపై దాడులు తాజాగా జోగులాంబ గద్వాల జిల్లా రేపల్లె గ్రామంలో దళితుల ఇంటిని కూల్చివేయడం అణచివేతకు సజీవ సాక్ష్యాలని వారు పేర్కొన్నారు. రాష్ట్రంలో సంపద పెరిగిన పేద ప్రజలకు సొంత ఇండ్లు లేవన్నారు. ప్రభుత్వము అసైన్డ్ భూములను గుంజుకుంటున్నారని.. గురుకులాలలో పిల్లలకు నాణ్యమైన ఆహారం దక్కడం లేదని విమర్శలు చేశారు. అధికారంలోకి వస్తే దళితుడు సీఎం అని మాజీ సీఎం కేసీఆర్ మోసం చేస్తే.. ఇప్పుడు ఆరు గ్యారెంటీల పేరుతో ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ మోసం గ్యారంటీగా పాలన సాగిస్తుందన్నారు. అగ్రకుల పార్టీల నుంచి గెలిచిన ఎస్సీ, ఎస్టీల ఎమ్మెల్యేలు ఎంపీలు మౌనంగా ఉండడం మాన్యశ్రీ కాన్షీరామ్ చెప్పిన చెంచా యుగానికి నిదర్శనం అన్నారు. రాజ్యాంగంలో హక్కులు ఉన్న పాలకులు అయ్యేది రాజకీయ పార్టీల ద్వారానే అన్న సత్యాన్ని మనం గ్రహించాలన్నారు. దళితులపై దాడులు జరుగుతున్నాయి తప్ప పాలకవర్గంపై కాదని విషయాన్ని కూడా బహుజన సమాజం నమ్మాలన్నారు. బహుజన సమాజంపై దాడులు ఆగాలంటే బహుజనులే పాలకులు కావాలన్నారు. రాజాధికారంతోనే బహుజనలకు రక్షణ, అభివృద్ధి సాధ్యమని సందర్భంగా వారు అన్నారు. కాబట్టి బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు మాన్యశ్రీ కాన్షీరాం వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ లో జరిగే భారీ బహిరంగ సభకు బహుజన సమాజంతో పాటు అంబేద్కరైట్లు పెద్ద మొత్తంలో హాజరై విజయవంతం చేయాలన్నారు. గోడపత్రికలను విడుదల చేసిన వారిలో జిల్లా కోశాధికారి శాంతిరాజు, జిల్లా ఈసీ సభ్యులు దేవన్న, రాముడు, ఆకేపోగు నగేష్, గద్వాల అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి రామ్ పోగు నరేష్ ఇతరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జన శోభాయాత్రలో హుషారెత్తించిన మంత్రి వాకిటి శ్రీహరి



మక్తల్ : పట్టణంలో నిర్వహించిన గణేష్ నిమజ్జన శోభాయాత్రలో మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొని సందడి చేశారు. భక్తులు, యువతతో కలిసి శోభాయాత్రలో ఉత్సాహంగా పాల్గొంటూ గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. గణేష్ మండపాల నిర్వాహకులు, భక్తులతో మంత్రి మమేకమయ్యారు. శోభాయాత్రలో భక్తుల ఉత్సాహాన్ని చూసి వారితో కలిసి సందడి చేశారు.

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR,**
**RANGA REDDY DISTRICT. T.S**
**DISPUTE NO : RA 314 OF 2025.**

**BETWEEN :**

**M/S. MARGADARSI CHIT FUND PRIVATE LIMITED,** VANASTHALIPURAM BRANCH.
REPRESENTED BY ITS FOREMAN/BRANCH MANAGER.
.....DISPUTANT

AND

1) **MR. JALATHOTI CHANDRAPAUL & 3 OTHERS**

TO, ....OPPONENTS

1) MR. JALATHOTI CHANDRA PAUL, S/O LATE JALATHOTI RAMAIAH, DOB:17.05.1970, W/AS: ADMIN OFFICER, EMP CODE: 557899, LIC OF INDIA, NEAR SHIVALAYM TEMPLE, MUDDANUR ROAD, JAMMALAMADUGU Y S R DISTRICT, A.P.-516434. R/O D.NO.16/296, SUNNAPURALLA MITTA, MASAPETA, D C ROAD, KADAPA Y S R DISTRICT, A.P-516001.

PREVIOUS W/AT: LIC OF INDIA, FINANCE & ACCOUNTS DEPT, DIVISIONAL OFFICE, KADAPA, Y S R DISTRICT.

2) MR. JALATHOTI PRASAD BABU, S/O JALATHOTI RAMAIAH, DOB: 23.06.1980, W/AS: DEVELOPMENT OFFICER, EMP. CODE: 614662, LIC OF INDIA, DIVISIONAL OFFICE, RAJAMPET (M), ANNAMAYYA DISTRICT, A.P. 516115, R/O D.NO.16/296, UPSTAIRS, SUNNAPURALLA MITTA, MASAPETA, D C ROAD, KADAPA , Y S R DISTRICT. A.P-516001.

3) MR. PALLIKONDU JAGAN MOHAN RAO, S/O LATE PALLIKONDU LAKSHUMAIAH, DOB:01.04.1972, W/AS: HOSTEL WELFARE OFFICER, EMP. CODE: 1203401, GOVERNMENT SOCIAL WELFARE, BOYS HOSTEL, BHAKARAPET (V), SIDDAVATAM (M), Y S R DISTRICT, A.P-516247. R/O D.NO.16/263, S R M STREET, MASAPETA, KADAPA, Y S R DISITRICT, A.P-516001.

4) MR.PANDETI VENU GOPAL RAJU, S/O PANDETI BASAVA RAJU, DOB: 04.06.1974, W/AS: RECORD CLERK, EMP. CODE: 610989, POLICY SERVICING DEPARTMENT, LIC OF INDIA, PRODDATUR, NEAR, SAI BABA TEMPLE, Y S R DISTRICT, A.P516360. R/O D.NO.41/1187/A, SANKARAPURAM, CHINNA-CHOWK, KADAPA, Y S R DISTRICT, A.P.516002.

PREVIOUS W/AT: LIC OF INDIA, BRANCH OFFICE KADAPA, Y S R DIST.

PLEASE TAKE NOTICE THAT THE ABOVE DISPUTE IS FILED AGAINST YOU FOR RECOVERY OF **RS. 7,54,399/- (RUPEES SEVEN LAKHS FIFTY FOUR THOUSAND THREE HUNDRED AND NINETY NINE ONLY)** AND THE SAME IS POSTED TO **13/10/2026** FOR YOUR APPEARANCE BEFORE THE OFFICE OF THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR, **R.R.DIST.T.S AT 12.00 P.M.** IF YOU FAIL TO ATTEND THE OFFICE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR ON THAT DAY THE MATTER WILL BE HEARD AND DECIDED EXPARTE.

**(BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR)**

FOREMAN /BRANCH MANAGER
FOR DISPUTANT COMPANY

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR,**
**RANGA REDDY DISTRICT. T.S**
**DISPUTE NO : RA 315 OF 2025.**

**BETWEEN :**

**M/S. MARGADARSI CHIT FUND PRIVATE LIMITED,** VANASTHALIPURAM BRANCH.
REPRESENTED BY ITS FOREMAN/BRANCH MANAGER.
.....DISPUTANT

AND

1) **MR. JALATHOTI CHANDRAPAUL & 8 OTHERS**

TO, ....OPPONENTS

1) MR. GUNDARAPU MALLESHAM, S/O LATE GUNDARAPU KUMAR, DOB:17.12.1986, OCC: PROP, M/S NIVYA HOSPITAL, R/O PLOT NO.23 & 30, 3-145/3, SHANTHI NAGAR, CHOUTUPPAL YADADRI BHONGIRI DISTRICT-508252. R/O # 3-145/3, SHANTHI NAGAR, CHOUTUPPAL, YADADRI - BHONGIRI DISTRICT-508252.

2) MR. GUNDARAPU SHIVA SHANKAR, S/O GUNDARAPU KUMAR, DOB: 11.01.1987, OCC: PROP, M/S SRI MANIKANTA MEDICAL & GENERAL STORES, # 3-145/3, SHANTHI NAGAR, CHOUTUPPAL, YADADRI - BHONGIRI DISTRICT-508252.

3) MR. USKAGULA SRISHAILAM, S/O USKAGULA SHANKARAIAH, DOB: 08.06.1991, OCC: PROP, M/S NIHARIKA DIAGNOSTIC CENTRE, # 3-145/5 & 3-145/5/1, SHANTHI NAGAR, CHOUTUPPAL, YADADRI -BHONGIRI DISTRICT-508252, R/O # 3-284/1, RAMNAGAR, CHOUTUPPAL, YADADRI BHONGIRI DISTRICT-508252.

4) MRS.GUNDARAPU NIRMALA, W/O LATE GUNDARAPU KUMAR, D/O SANGEETHM SHIVA RAJA, DOB:01.01.1966, OCC: AGRICULTURIST, R/O # 3-145/3, SHANTHI NAGAR, CHOUTUPPAL, YADADRI - BHONGIRI DISTRICT-508252.

5) MRS.GUNDARAPU GEETHA, W/O GUNDARAPU MALLESHAM, D/O SANGEETHAM NAGENDRAM, DOB: 09.05.1995, OCC: HOUSE WIFE, R/O # 3-145/3, SHANTHI NAGAR, CHOTUPPAL, YADADRI - BHONGIRI DISTRICT-508252.

6) MR.USHKAGULA SHIVA KRISHNA, S/O USHKAGULA SHANKARAIAH, DOB: 15.06.1994, W/AS: SENIOR : SOFTWARE ENGINEER, EMP CODE: 10077775, M/S IVY SOFTWARE DEVELOPMENT SERVICES PVT LTD, PLOT NO.13/E, SY NO.13, 5TH FLOOR, BLOCK-B, DIVYA SHREE OMEGA, KONDAPUR, HYDERABAD-500031, R/O # 3-284/1, RAM NAGAR, CHOUTUPPAL, YADADRI BHONGIRI DISTRICT-508252.

7) MR.KONDA NARSIMHULU, S/O KONDA YADAGIRI, DOB: 30.03.1981, OCC: PROP, M/S PRIYANKA BONES HOSPITAL, # 5-5-494/12B, NEAR GANDHI PARK, CHOUTUPPAL, YADADRI-BHONGIRI DISTRICT-508252, R/O PLOT NO.24P, # 4-12-944, ROAD NO.6, AUTO SAI NAGAR, AUTO NAGAR, VANASTHALIPURAM, HYDERABAD-500070.

8) MRS.KONDA UMA DEVI, W/O KONDA NARSIMHULU, DOB: 12.06.1984, OCC: JOINT PROPERTY HOLDER, PLOT NO.24P, # 4-12-944, ROAD NO.6, AUTO SAI NAGAR, AUTO NAGAR, VANASTHALIPURAM, HYDERABAD-500070.

9) MR.MADAGONI SHEKAR S/O MADAGONI ESWARAIAH, DOB: 03.06.1990, OCC: PROP, MANI ELECTRONICS AND SANITORY, # 4-44, MAIN ROAD, NEAR VALIGONDA 'X' ROADS, JAIKESARAM, CHOUTUPPAL, YADADRI-BHONGIRI DISTRICT-508252.

PREVIOUS BUSINESS ADD: # 3-131, MAIN ROAD, CHOUTUPPAL, YADADRI-BHONGIRI DISTRICT.

PLEASE TAKE NOTICE THAT THE ABOVE DISPUTE IS FILED AGAINST YOU FOR RECOVERY OF **RS. 42,18,438/- (RUPEES FORTY TWO LAKHS EIGHTEEN THOUSAND FOUR HUNDRED AND THIRTY EIGHT ONLY)** AND THE SAME IS POSTED TO **13/10/2026** FOR YOUR APPEARANCE BEFORE THE OFFICE OF THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR, **R.R.DIST.T.S AT 12.00 P.M.** IF YOU FAIL TO ATTEND THE OFFICE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR ON THAT DAY THE MATTER WILL BE HEARD AND DECIDED EXPARTE.

**(BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR)**

FOREMAN /BRANCH MANAGER
FOR DISPUTANT COMPANY

# విద్యాభివృద్ధికే అత్యధిక ప్రాధాన్యం..
# భవిష్యత్ తరాలను తీర్చిదిద్దడమే లక్ష్యం




**ఎంవీఎస్ జూనియర్ కళాశాల & ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలల అభివృద్ధికి 15 కోట్లు మంజూరు**
**ఏఐ యుగంలో టెక్నికల్, స్కిల్ ఎడ్యుకేషన్‌కు పెద్దపీట..**
**పాఠశాలలు, ఇంటర్, డిగ్రీ కళాశాలల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ**
**- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

మహబూబ్‌నగర్ :నియోజకవర్గంలో విద్యా రంగ అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్య, మౌలిక వసతులు, క్రీడలు, నైపుణ్యాభివృద్ధిపై సమగ్ర దృష్టి సారించి విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని వెల్లడించారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాల అభివృద్ధికి 6.86 కోట్ల రూపాయలతో భవన నిర్మాణాలకు చర్యలు తీసుకుంటున్నామని అలాగే, ఎంవీఎస్ జూనియర్ కళాశాలలో శిథిలావస్థకు చేరిన భవనాల కారణంగా ప్రస్తుతం ఒకే భవనంలో తరగతులు నిర్వహిస్తున్న పరిస్థితిని మార్చాల్సిన అవసరం ఉందన్నారు. పాత భవనాల స్థానంలో ఆధునిక వసతులతో కొత్త భవనాలను నిర్మించి కళాశాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఎంవీఎస్ జూనియర్ కళాశాలను భవిష్యత్తులో తెలంగాణ పబ్లిక్ స్కూల్ తరహాలో కేజీ నుంచి 12వ తరగతి వరకు విద్య అందించే సమగ్ర విద్యాసంస్థగా తీర్చిదిద్దే ఆలోచన ఉందన్నారు. సుమారు రూ. 7.95 కోట్లతో భవన నిర్మాణం పూర్తయిన అనంతరం హైస్కూల్‌ను కూడా అక్కడికి తరలించి, పాఠశాల–జూనియర్ కళాశాలకు ఒకే ప్రాంగణంలో సమగ్ర విద్యా విధానం అమలు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహబూబ్‌నగర్‌లోని ఎంవిఎస్ డిగ్రీ కళాశాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన తెలిపారు. కొత్త బ్లాక్ నిర్మాణంతో పాటు కళాశాల సమగ్ర అభివృద్ధికి సుమారు రూ. 70 కోట్ల అంచనాతో దశలవారీగా పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ కళాశాల 60వ వార్షికోత్సవాన్ని ఈ విద్యా సంవత్సరంలో ఘనంగా నిర్వహించాలని భావిస్తున్నామని తెలిపారు. గత ఆరు దశాబ్దాల్లో కళాశాలలో చదివి పట్టాలు పొందిన పూర్వ విద్యార్థులను భాగస్వామ్యం చేసి భారీ స్థాయిలో వేడుకలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించి ఘనంగా నిర్వహించేందుకు ప్రయత్నిస్తామని వెల్లడించారు. విద్యార్థుల వసతి సమస్యల పరిష్కారానికి ఇప్పటికే రెండు హాస్టల్ బ్లాకుల నిర్మాణం చేపట్టామని ఎమ్మెల్యే తెలిపారు. ఎస్సీ బాలురు, బాలికల కోసం కూడా హాస్టళ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలను విద్యార్థుల వసతి అవసరాలకు వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. పాలమూరు యూనివర్సిటీ లో అత్యంత వేగంగా ఇంజనీరింగ్ కళాశాల మరియు లా కళాశాల భవనాలు నిర్మాణం జరుపుకుంటున్నాయని, తాను ఎమ్మెల్యే గా ఎన్నికైన తర్వాత పాలమూరు యూనివర్సిటీలో రెండు హాస్టల్ భవనాలను ప్రారంభించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. జిల్లా క్రీడా మైదానం వెనుక భాగంలో బాలికల హాస్టల్ నిర్మాణానికి స్థల కేటాయింపు అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యం ఇస్తూ స్టేడియం అభివృద్ధికి అవసరమైన స్థలం, మౌలిక వసతులపై సంబంధిత అధికారులతో చర్చిస్తున్నామని చెప్పారు. మైనారిటీ విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు భవిష్యత్తులో రెండు మైనారిటీ విద్యాసంస్థలను ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీరన్న పేటలో రెండు మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయని, త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. అదేవిధంగా సుమారు రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. త్వరలో భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి, వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని వెల్లడించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆటోమేషన్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ రంగంలో వేగంగా మార్పులు వస్తున్నాయని, ఇప్పటికే పలు దేశాల్లో డ్రైవర్‌లెస్ రవాణా వ్యవస్థలు, ఆటోమేటెడ్ టెక్నాలజీలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. అమెరికా వంటి దేశాల్లో డ్రైవర్‌లెస్ ట్యాక్సీల వంటి సాంకేతికతలు వినియోగంలోకి వస్తున్న నేపథ్యంలో మనం కూడా భవిష్యత్ సవాళ్లకు ఇప్పటి నుంచే సిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. 'రాబోయే రోజుల్లో టెక్నాలజీ మరింత వేగంగా అభివృద్ధి చెందుతుంది. ఈ మార్పులను ముందుగానే గుర్తించి మన పిల్లలకు టెక్నికల్ ఎడ్యుకేషన్, స్కిల్ డెవలప్‌మెంట్ అందించాలి. వారి ఉద్యోగ అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను చిన్న వయసు నుంచే పెంపొందించాలి" అని యెన్నం అన్నారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న సాంకేతిక మార్పుల ప్రాధాన్యతను తెలంగాణ ప్రభుత్వం ముందుగానే గుర్తించి స్కిల్ ఎడ్యుకేషన్‌కు ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక విద్యకు సంబంధించిన కార్యక్రమాలను విస్తరిస్తున్నామని చెప్పారు. ఐటీఐలు, నైపుణ్య శిక్షణా కేంద్రాల ద్వారా యువతకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందిస్తున్నామని వెల్లడించారు. టాటా టెక్నాలజీ భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన సాంకేతిక శిక్షణా కార్యక్రమాల ద్వారా కూడా యువతకు ఆధునిక నైపుణ్యాలను అందిస్తున్నామని తెలిపారు. శిక్షణ పొందిన విద్యార్థులకు మెరుగైన ప్లేస్‌మెంట్ అవకాశాలు కల్పించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. కేవలం భవనాలు నిర్మించడం మాత్రమే కాకుండా, ఆధునిక విద్య, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్య శిక్షణ అందించేలా విద్యాసంస్థలను తీర్చిదిద్దాలన్నదే తమ లక్ష్యమన్నారు. 'విద్యపై పెట్టే పెట్టుబడి మన పిల్లల భవిష్యత్తుపై పెట్టే పెట్టుబడి. రోడ్లు, భవనాలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి జరుగుతూనే ఉంటుంది. కానీ మన పిల్లలకు అందించే విద్యే వారి భవిష్యత్తును నిర్ణయిస్తుంది. రాబోయే సవాళ్ల నుంచి మన పిల్లలను, మన సమాజాన్ని కాపాడాలంటే మంచి విద్యతో పాటు సాంకేతిక విద్య, నైపుణ్య శిక్షణ అందించడమే మార్గం" అని ప్రభుత్వ విప్ స్పష్టం చేశారు. 'పాఠశాలలు, ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలలను అభివృద్ధి చేయడంతో పాటు విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించడంపై నిరంతరం దృష్టి సారిస్తాం. నా శక్తి, సమయం, ఎనర్జీ మొత్తం విద్యాభివృద్ధిపైనే కేంద్రీకరిస్తాను" అని యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్ పి వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ మీడియా ఇంచార్జీ సిజె బెనహర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ కార్యనిర్వహక అధ్యక్షులు అజ్మత్ అలి, సుధాకర్ రెడ్డి, మోయిూజ్ తదితరులు పాల్గొన్నారు.

# చీర్యాల్‌లో ఘనంగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి



వేకువ సమయం సెప్టెంబర్ 25 కీసర ప్రతినిధి : కీసర డివిజన్–1 పరిధిలోని చీర్యాల ఎక్స్‌రోడ్డు వద్ద పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.దేశం, సమాజం కోసం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చేసిన సేవలను నాయకులు స్మరించుకున్నారు. కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జిల్లాల తిరుమలరెడ్డి, కీసర డివిజన్ అధ్యక్షుడు కోల బాల్ రాజ్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలోని చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు అందాలనే లక్ష్యంతో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆలోచనలు సాగాయని పేర్కొన్నారు. ఆయన సిద్ధాంతాలు, ఆశయాలను నేటి తరానికి పరిచయం చేయాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందన్నారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చూపిన మార్గంలో నడుస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఆయన జయంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు, ప్రజా అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఏలూరు సత్యనారాయణ ముదిరాజ్, ఉమారెడ్డి, కోల మల్లేష్ యాదవ్, బర్లపాటి ఆంజనేయులు, సుదర్శన్, శివ ముదిరాజ్, మహేందర్, బాలకృష్ణ, వీరస్వామి, భాస్కర్ ముదిరాజ్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బత్తుల ఆంజనేయులు, బత్తుల కుమార్, నాగేష్, చిరంజీవి, పార్టీ పెద్దలు, కార్యకర్తలు హాజరై దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు నివాళులర్పించారు.

# ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందించిన మంత్రి




మక్తల్ : మక్తల్ మండలం నర్సిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను మంత్రి వాకిటి శ్రీహరి అందజేశారు. క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలను స్వయంగా అందించి శుభాకాంక్షలు తెలిపారు.అర్హులైన ప్రతి కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ఇల్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

# చలో ఖమ్మం.. ఏఐకేఎంఎస్ 4వ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

మల్దకల్: రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, పేద ప్రజల హక్కుల కోసం పోరాటాలను మరింత ఉధృతం చేయాలని IFTU జిల్లా అధ్యక్షులు జమ్మిచేడు కార్తీక్, PDSU జిల్లా అధ్యక్షులు హాలింపాష పిలుపునిచ్చారు. జోగులాంబ గద్వాల్ జిల్లా మల్దకల్ మండల కేంద్రంలో ఏఐకేఎంఎస్ 4వ జాతీయ మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల సమస్యలు, వ్యవసాయ కూలీల కష్టాలు, కార్మికుల హక్కులపై జరుగుతున్న నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తూ ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రైతు పండిస్తేనే దేశానికి అన్నం.. కార్మికుడు శ్రమిస్తేనే దేశ అభివృద్ధి. అలాంటి రైతు, కార్మికుల హక్కులను కాపాడేందుకు ఐక్య పోరాటాలను నిర్మించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. సెప్టెంబర్ 28, 29, 30 తేదీలలో ఖమ్మంలోని కామ్రేడ్ రాయల, సుభాష్ చంద్రబోస్, రవన్న గ్రౌండ్‌లో ఏఐకేఎంఎస్ 4వ జాతీయ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహాసభల సందర్భంగా జరిగే బహిరంగ సభకు ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షులు కామ్రేడ్ వేములపల్లి వెంకటరామయ్య ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.



"హక్కుల కోసం ఐక్యంగా.. సమస్యల పరిష్కారం కోసం పోరాటంగా.. చలో ఖమ్మం!" రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, పేదలు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో ఖమ్మం చేరుకుని ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు తిమ్మప్ప, ముని, నర్సింహులు, రామన్న తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరు జర్నలిస్టు సంక్షేమ సంఘానికి ప్రభుత్వ విప్ యెన్నం రూ.2 లక్షల విరాళం



మహబూబ్ నగర్ : పాలమూరు జర్నలిస్టుల సంక్షేమానికి ఎల్లవేళలా అండగా ఉంటానని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. పాలమూరు జర్నలిస్టు సంక్షేమ సంఘానికి తన వంతు సహకారంగా ప్రతి నెలా రూ. 1 లక్ష ఆర్థిక సాయం అందజేస్తామని ప్రకటించిన ఆయన, రెండు నెలలకు సంబంధించిన రూ. 2 లక్షల చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంఘం ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, ప్రభుత్వం–ప్రజల మధ్య వారధిగా పాత్రికేయులు పనిచేస్తున్నారని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం ఎంతో ముఖ్యమని, వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని భరోసా ఇచ్చారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఆర్థిక సహాయం అందిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కి పాలమూరు జర్నలిస్టు సంక్షేమ సంఘం ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు అశోక్ కుమార్, మధుసూదన్ రెడ్డి, తిరుపతయ్య, అయిలమోని శేఖర్, నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్‌పుర వరసిద్ధి వినాయకుడికి ప్రభుత్వ విప్ యెన్నం ప్రత్యేక పూజలు







**భక్తులతో కలిసి ప్రసాదం స్వీకరణ**
**ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్ష**

మహబూబ్ నగర్ : వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మహబూబ్‌నగర్ నగరంలోని హనుమాన్‌పురలోని స్థానిక శ్రీశ్రీశ్రీ పవనపుత్ర వీరాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో కొలువుదీరిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారికి ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి లి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడిని ఆయన దర్శించుకుని అర్చనలు చేశారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు స్వీకరించిన అనంతరం మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించి, భక్తులతో కలిసి కూర్చొని ఆయన అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆ విఘ్నేశ్వరుని కృపా కటాక్షాలతో మహబూబ్‌నగర్ నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు తెలిపారు. పట్టణంలో గణేష్ నవరాత్రులు శాంతియుత, ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, నగర డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు, ఆలయ కమిటీ చైర్మన్ హనుమంతు, ఆలయ కమిటీ సభ్యులు, ఉత్సవ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






# విద్యాభివృద్ధికి మౌలిక వసతులను కల్పిస్తాం ఎమ్మెల్యే జిఎంఆర్ హామీ





దేవరకద్ర : అడ్డాకుల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు టై, బెల్ట్, షూస్, బాగ్స్‌ను దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (GMR) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంతో పాటు, వారికి అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.



అందులో భాగంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విద్యాశాఖను తన వద్దే ఉంచుకుని, గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన విద్యా వ్యవస్థను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు విద్యే బలమైన పునాది అని, ప్రతి విద్యార్థి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాన్ని అందిపుచ్చుకొని, కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం అడ్డాకుల మండలానికి చెందిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ చేసి, తదనంతరం అడ్డాకుల మండలానికి చెందిన కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసారు

## విదేశాలలో ఉద్యోగావకాశాలు: 'టామ్‌కామ్' ఆధ్వర్యంలో నమోదు ప్రక్రియ షురూ

మహబూబాబాద్ జిల్లా సెప్టెంబర్ 25 వేకువ సమయం ప్రతినిధి : తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ ఫ్యాక్టరీల శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న నమోదిత రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ 'తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్' (TOMCOM) ద్వారా అర్హత, నైపుణ్యం కలిగిన అభ్యర్థులకు పలు దేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి T. రజిత నేడు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు సురక్షితమైన, చట్టబద్ధమైన మార్గాల ద్వారా విదేశీ ఉపాధి పొందవచ్చని పేర్కొన్నారు.

**వివిధ దేశాలలో లభ్యమయ్యే ఉద్యోగాల వివరాలు:**

1.జర్మనీ : నర్సులు: జీతం 3,09,900/నెల (EUR 2,800). వయస్సు: 22–38 సం. అర్హత: B.Sc నర్సింగ్ / Post Basic B.Sc / GNM. (B.Sc పూర్తి చేసినవారు లేదా GNMతో 3 ఏళ్ల అనుభవం)

ఆస్బిల్డంగ్ (హెల్త్ & నర్సింగ్): జీతం 3,09,900 – 3,31,000/నెల (EUR 2,800-3,000). వయస్సు: 18–28 సం. అర్హత: ఇంటర్మీడియట్ (ఫ్రెషర్స్ అర్హులు)

ఫిజియోథెరపిస్ట్ & ఆక్యుపేషనల్ థెరపిస్ట్: జీతం 2,71,900 – 3,15,400/నెల (EUR 2,500-2,900). వయస్సు: 43 ఏళ్ల లోపు. అర్హత: DPT / BPT / MPT / B.Sc ఆక్యుపేషనల్ థెరపీ (కనీసం 1 సం. అనుభవం).

2.ఇజ్రాయెల్ (Israel)

హోమ్ బేస్డ్ కేర్‌గివర్స్: జీతం 1,99,000+ పైగా/నెల. వయస్సు: 25–45 సం. అర్హత: ANM / GNM / DMPHW / DMPHA / B.Sc నర్సింగ్ / Post B.Sc నర్సింగ్ (కనీసం 2 ఏళ్ల అనుభవం).

3.ఆస్ట్రియా (Austria) నర్సులు: జీతం 3,09,900/నెల (EUR 2,800). వయస్సు: 22–38 సం. అర్హత: B.Sc నర్సింగ్ / GNM (B.Sc పూర్తయినవారు లేదా GNM తో 3 ఏళ్ల అనుభవం).

4.ఐర్లాండ్ (Ireland) రిజిస్టర్డ్ నర్సులు: జీతం 3,40,000/నెల (EUR 3,100). వయస్సు: 22–45 సం. అర్హత: B.Sc నర్సింగ్ / GNM (కనీసం 2 ఏళ్ల అనుభవం).

5.యుఎస్ఏ (USA) :రిజిస్టర్డ్ నర్స్ (RN): జీతం సంవత్సరానికి 60–80 లక్షలు ($70,000 - $95,000). వయస్సు: 33–45 ఏళ్లు. అర్హత: B.Sc నర్సింగ్ (4 ఏళ్లు), యాక్టివ్ ఇండియన్ లైసెన్స్, RN NCLEX ఉత్తీర్ణత, IELTS 6.5 లేదా OET Grade B (కనీసం 2 ఏళ్ల అనుభవం).

6.సౌదీ అరేబియా (Saudi Arabia): రిజిస్టర్డ్ నర్సులు: జీతం 1,37,000/నెల (SAR 5,400). వయస్సు: 22–45 సం. అర్హత: B.Sc నర్సింగ్ (కనీసం 2 ఏళ్ల అనుభవం).

7.ఖతార్ (Qatar):రిజిస్టర్డ్ నర్సులు (పురుషులు/మహిళలు): జీతం 1,21,976/నెల (QAR 5,000). వయస్సు: 22–45 సం. అర్హత: B.Sc నర్సింగ్ / GNM (కనీసం 2 ఏళ్ల అనుభవం).

8. మారిషస్ రిజిస్టర్డ్ నర్సులు: జనరల్ వార్డ్: 59,000/నెల; స్పెషాలిటీ నర్స్: 71,000/నెల. వయస్సు: 22–45 సం. అర్హత: నర్సింగ్‌లో డిగ్రీ (కనీసం 2 ఏళ్ల అనుభవం).

9. దుబాయ్ (Dubai): క్యాబ్ డ్రైవర్లు: జీతం 64,800 –90,000/నెల (AED2,500–3,500 – కమిషన్ ఆధారితం). వయస్సు: 23–47 సం. అర్హత: 10వ తరగతి (కనీసం 1 సం. అనుభవం),

ఇ–బైక్ రైడర్స్: స్థిర జీతం 65,000 నుండి కమిషన్‌తో కలిపి 1,50,000/నెల వరకు (AED 2,500–6,000). వయస్సు: 23–45 సం. అర్హత: 10వ తరగతి (కనీసం 2 ఏళ్ల అనుభవం).

టైల్స్ మేసన్, స్టీల్ ఫిక్సర్, షట్టరింగ్ కార్పెంటర్, స్కాఫోల్డర్: జీతం 38,000/నెల (AED 1,453 – 10 గంటల డ్యూటీ). వయస్సు: 20–45 సం. అర్హత: చదువుతో నిమిత్తం లేదు (కనీసం 2 ఏళ్ల అనుభవం).

జనరల్ హెల్పర్: జీతం 31,200/నెల (AED 1,200 – 10 గంటల డ్యూటీ). వయస్సు: 20–45 సం. అర్హత: చదువుతో నిమిత్తం లేదు (కనీసం 1 సం. అనుభవం).

10.ఒమన్ వ్యవసాయ కార్మికులు : జీతం 40,000/నెల (OMR 160). వయస్సు: 21–35 సం. అర్హత: 10వ తరగతి (వ్యవసాయ రంగంలో కనీసం 2 ఏళ్ల అనుభవం).

11.మలేషియా (Malaysia): కన్‌స్ట్రక్షన్ హెల్పర్స్, స్టీల్ ఫిక్సర్, పైప్ ఫిట్టర్, ఎక్స్కవేటర్ & బ్యాక్‌హో ఆపరేటర్: జీతం ఫ్రెషర్లకు 40,298/నెల (RM 1,700) అనుభవజ్ఞులకు 42,668 – 47,409/నెల (RM 1,800–2,000). వయస్సు: 20–35 సం. అర్హత: 10th / 10+2 / Diploma / ITI (ఫ్రెషర్స్ మరియు అనుభవజ్ఞులు అర్హులు).

1 2.ఫిజీ (Fiji): వివిధ రంగాలు (Multiple Sectors): జీతం 1,250 – 1,460 F$/నెల (గంటకు 6 F$). అర్హత: ఫిజీ డాక్యుమెంట్ల ప్రకారం (కనీసం 2 ఏళ్ల అనుభవం).

దరఖాస్తు విధానం:

నైపుణ్యం, అర్హతలు కలిగిన అభ్యర్థులు తమ వివరాలను నమోదు చేసుకోవడానికి అధికారిక వెబ్‌సైట్ www.tomcom.telangana.gov.in ను సందర్శించవచ్చు లేదా 08035524946 ఫోన్ నంబర్ ద్వారా సంప్రదించవచ్చని జిల్లా ఉపాధి కల్పనాధికారి తెలిపారు.

## మూలమల్లలో ఘనంగా సామూహిక కుంకుమార్చన

## శ్రీ పాండురంగ స్వామి దేవస్థానంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

ఆత్మకూరు : వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం మూలమల్ల గ్రామంలోని శ్రీ పాండురంగ స్వామి దేవస్థానంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) హిందూ ధార్మిక పరిషత్ మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో నేడు సామూహిక కుంకుమార్చన పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. టీటీడీ ధార్మిక పరిషత్ కోఆర్డినేటర్ శ్రీ రామాచారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పల్లెగడ్డ శ్రీరాములు, రాజన్న గౌడ్ రమేష్, ధార్మిక పరిషత్ సభ్యులు, దేవస్థానం అధ్యక్షులు ఏ. నరసింహారెడ్డి, పాశం వెంకటేశ్వర్ రెడ్డి, భజన మండలి నిర్వాహకులు గేర్ల సత్యారెడ్డి, సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ పాండురంగ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని భక్తులతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం మహా మంగళహారతి, సంప్రోక్షణ, నైవేద్య కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ జోషి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భోజన కార్యక్రమాలను పాశం వెంకటేశ్వర్ రెడ్డి, పద్మనారెడ్డి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారిని ఆలయ నిర్వాహకులు, అర్చకులు అభినందించి వేద ఆశీర్వచనాలు అందజేశారు. సామూహిక కుంకుమార్చనలో



మహిళలు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ పాండురంగ స్వామివారి ఆశీస్సులు పొందారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది.

## బిజెపి సిద్ధాంతకర్త 110 వ జయంతి



కొత్తకోట : బీజేపీ సిద్ధాంత కర్త పండిత్ దీనదయాళ్ ఉపాధ్యాయ 110 వ జయంతి ఉత్సవాన్ని కొత్తకోట పట్టణం లో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కొమ్ము భూషణ్ జిల్లా ఉపాధ్యక్షులు ప్రసంగించారు. దీన్ దయాల్ ఉపాధ్యాయ గారు పేద బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి, ఉన్నత చదువులను అభ్యసించి, రాష్ట్రీయ స్వయంసేవక సంఘ సిద్ధాంతాలకు ఆకర్షితుడై ఆజన్మ బ్రహ్మచారిగా, భారత సమాజానికి నిస్వార్థ సేవలను అందించిన మహానుభావులు అని కొనియాడారు. ఆద్య సరసంగచాలక్ ఆజ్ఞ మేరకు భారతీయ జన సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు శ్యామా ప్రసాద్ ముఖర్జీలి కి తోడ్పాటును అందించుట కొరకై సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా ఉంటూ, భారతీయ జన సంఘ ను దేశమంతా విస్తరించుట కై అవిశ్రాంతంగా పనిచేశారు. 1966 లో ఏకాత్మ మానవ వాదం అనే సిద్ధాంతాన్ని పార్టీకి అందించిన సిద్ధాంతకర్త పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ. సమాజంలో గల చిట్టచివరి పేదవాడికి ప్రభుత్వ ఫలాలను అందించాలన్నదే అంత్యోదయ సిద్ధాంతం. భారతీయ జనసంఘే భారతీయ జనతా పార్టీ గా ఆవిష్కృతమైంది. భారత ప్రధాని నరేంద్ర మోడీ 12 సంవత్సరాలుగా ఉపాధ్యాయ గారు ఆవిష్కరించిన అంత్యోదయ సిద్ధాంతంలో భాగమే ఉచితబియ్యం, ఉచిత గ్యాస్ పంపిణీ, ఉచిత బ్యాంకు ఖాతాల ప్రారంభం లాంటి అనేక పథకాలు. ప్రధాని అందిస్తున్న పథకాలు వారి సిద్ధాంతాలను సజీవంగా ఉంచుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో గల పేదవారు సంపూర్ణంగా ప్రభుత్వ ఫలాలను అందుకోవాలంటే, ఈ రాష్ట్రంలో భాజాపా అధికారంలోకి రావాలి. అందుకొరకు వారి 110వ జయంతి సందర్భంగా కార్యకర్తలమైన మనమందరము పార్టీని అధికారంలోకి తేవడం కొరకు కంకణ భద్దులమవుతామని ప్రతిజ్ఞ చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో దాబా శ్రీనివాసరెడ్డి, పబ్బా నరేందర్ గౌడ్, సాయిరాం,కోటీశ్వర్ రెడ్డి, చీర్ల నరసింహ, శ్రీకాంత్ రెడ్డి, అప్పరాల నరసింహ, సత్యం సాగర్, ఖాజా మైనోద్దీన్ , వినోద్ గౌడ్, జాను నాయక్, ఏలియా, నందిమల్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

## సిటిజన్ న్యూస్ ఛానల్ సీఈవో రవి కుమార్ కి ఘన సన్మానం

వనపర్తి, సమయం ప్రతినిధి : వనపర్తి జిల్లా కేంద్రం పట్టణ పరిధి గాంధీ చౌక్ లో సిటిజన్ న్యూస్ ఛానల్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా జర్నలిస్ట్ మిత్రులు కనమోని ఆంజనేయులు దుప్పల్లి సురేష్ కుమ్మరి రాము సందర్శించారు. సీనియర్ జర్నలిస్ట్ సిటిజన్ న్యూస్ ఛానల్ సీఈఓ రవికుమార్ ను అభినందిస్తూ శాలువాతో సత్కరించి పూల బొకేతో శుభాకాంక్షలు తెలియజేశారు అనంతరం మాట్లాడుతూ ప్రజల సమస్యలపై ప్రతినిత్యం అధికారులను, నాయకులను ప్రభవితం చేస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నిజాని నిర్భయంగా ప్రపంచానికి చూపించి ప్రజల మన్ననలు పొంది సిటిజన్ న్యూస్ ఛానల్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

-కార్యాలయాన్ని సందర్శించి అభినందనలు తెలిపిన జర్నలిస్టు మిత్రులు.







# రూ.1.50 కోట్లతో మినీ ట్యాంక్ బండ్ సుందరీకరణ

**పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ప్రభుత్వ విప్, వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, ఓపెన్ జిమ్, బతుకమ్మ ఘాట్ ఏర్పాటు**

**పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి: అధికారులకు ఆదేశం**

మహబూబ్‌నగర్ : పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన, ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) నిధులు రూ. 1.50 కోట్లతో మినీ ట్యాంక్ బండ్‌పై చేపట్టిన సుందరీకరణ, అభివృద్ధి పనులను ఆయన సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మినీ ట్యాంక్ బండ్‌ను పట్టణవాసులు కుటుంబ సమేతంగా వచ్చి సేదతీరేలా అన్ని హంగులతో తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వాకర్స్ సౌకర్యార్థం అత్యాధునిక వాకింగ్ ట్రాక్, యువత ఫిట్‌నెస్ కోసం ఓపెన్ జిమ్, ప్రత్యేక సెల్ఫీ పాయింట్, చిన్నారుల వినోదం కోసం ప్రత్యేక చిల్డ్రన్స్ ప్లే ఏరియాను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా మహిళలు ఘనంగా వేడుకలు జరుపుకునేలా విశాలమైన బతుకమ్మ ఘాట్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో ఎక్కడా నాణ్యతా ప్రమాణాలు తగ్గకుండా చూసుకోవాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా పనులను వేగవంతంగా పూర్తి చేసి, త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, నగర డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామానుజులు రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## అస్పృశ్యత, అసమానతలను సామాజిక స్పృహతో రచనలు సాగించిన మహాకవి గుర్రం జాషువా 28న 131 వ జయంతి



వనపర్తి : గుర్రం.జాషువా 131 జయంతిని ఈనెల 28న ఘనంగా నిర్వహించడంతో పాటు 29వ తేదీన సాయంత్రం 4.00గంటలకు M.N.R ఫంక్షన్ హాల్ నందు గుర్రం.జాషువా సాహితీ సదస్సు గౌరవ నిరంజన్ రెడ్డి గారి ఆధ్వర్యంలో నిర్వహిస్తామని కాబట్టి కవులు,కళాకారులు,సాహితీవేత్తలు,విద్యార్థులు,యువకులు,బహుజనులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు పలుస.శంకర్ గౌడ్ పిలుపునిచ్చారు. గౌరవ నిరంజన్ రెడ్డి స్వగృహంలో నిర్వహించిన పాత్రికేయ సమావేశములో పలుస.శంకర్ గౌడ్,డాక్టర్.వీరయ్య, శ్రీ.నారాయణ రెడ్డి, ఎం.రాజశేఖర్ మాట్లాడుతూసమాజములో అస్పృశ్యత,అసమానతలను రూపుమాపడానికి 19దశకంలో తన రచనల ద్వారా గుర్రం. జాషువా గారు విశేష కృషి చేశారని వారి చరిత్ర భావితరాలకు అందించాలని గుర్రం. జాషువా సాహితీ సదస్సు నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమములో ముఖ్య అతిథిగా మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిఆత్మీయ అతిథులుగా రావుల.చంద్రశేఖర్ రెడ్డి,ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ పాల్గొంటారని తెలిపారు. సాహితీ పోషకులుగా నిరంజన్ రెడ్డి సామాజిక స్పృహతో రచనలు సాగించిన మహాకవుల చరిత్రలను నిత్యం వెలుగులోకి తీసుకువస్తున్న నిరంజన్ రెడ్డి మాజీ మంత్రి సాహితీ కళా పోషకులుగా నిలిచిపోతారని కొనియాడారు.గతములో కవి సమ్మేళనాలు, సి.నారాయణ రెడ్డిజయంతి,సురవరం .ప్రతాప రెడ్డి సాహితీ సదస్సు మరియు ఔత్సాహిక కవులను ప్రోత్సహించడంలో నిరంజన్ రెడ్డి కృషి మరువలేనిదని వారు కొనియాడారు. ఈ సమావేశములో గట్టు యాదవ్ వాకిటి శ్రీధర్ నందిమల్ల.అశోక్,గంధం.పరంజ్యోతి, కురుమూర్తి యాదవ్, ఉంగ్లం. తిరుమల్,ఎద్దుల. సాయి కుమార్ ,పెద్దింటి.వెంకటేష్,నాగన్న యాదవ్, సర్పంచ్ శాంతయ్య,వెంకటయ్య, నీలస్వామి,బొబ్బిలి. ప్రేమ్ కుమార్, సూర్యవంశం.గిరి, సునీల్ వాల్మీకి,చిట్యాల.రాము, వేణు,బాబు నాయక్, కుమార్, సి.శంకర్,కుమ్మరి సత్యం ఉన్నారు.

## పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి ఘనంగా నిర్వహణ



దేవరకొండ, సెప్టెంబర్ 25 (సమయం ప్రతినిధి) : దేవరకొండ: భారతీయ జనతా పార్టీ దేవరకొండ మండల శాఖ అధ్యక్షులు నేనావత్ రాము నాయక్ ఆధ్వర్యంలో ఈరోజు దేవరకొండ మండల శాఖలోని పార్టీ కార్యాలయం బొల్లి గుట్ట X రోడ్‌లో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకూరి నరసింహ మాట్లాడుతూ...పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ భారతీయ జనసంఘ్‌కు దిశానిర్దేశం చేసిన మహనీయులు. సమాజంలోని చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు అందాలనే లక్ష్యంతో 'అంత్యోదయ' సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ఏకాత్మ మానవతావాదం ద్వారా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, దేశీయ ఆలోచనా విధానానికి గొప్ప ప్రాధాన్యత కల్పించారు.దేశం కోసం, సమాజం కోసం ఆయన చేసిన సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం. పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే నిజమైన అభివృద్ధి అనే ఆయన ఆలోచనలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలి. ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్టి మోర్చా జిల్లా అధ్యక్షులు వినోద్ రాథోడ్, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చిత్రం ఉదయ్, గుండాల అంజయ్య , చండీశ్వర్, వి రవీందర్, రెడ్డి శంకర్, అంకూరి కిరణ్, దర్శనం అంజి, రామకృష్ణ, అవ్వారి శేఖర్ నాయకులు, కార్యకర్తలు, వివిధ మోర్చాల పదాధికారులు మరియు పార్టీ శ్రేణులు పాల్గొని పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ కి ఘన నివాళులర్పించారు.

## వయోవృద్ధుల కోసం ఉచిత ఆరోగ్య శిబిరం...




గద్వాల : అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం-2026 సందర్భంగా నిర్వహిస్తున్న వయోవృద్ధుల వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఉచిత ఆరోగ్య శిబిరాన్ని జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో నిర్వహించారులి. జిల్లా ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారుల పర్యవేక్షణలో, జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, ఆదేశాల మేరకు, మహిళా శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సాధికారిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి సునంద సూచనలతో జిల్లా ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ సంధ్యా కిరణ్మయి సహకారంతో ఈ ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌లోని వయోవృద్ధులు, సీనియర్ సిటిజన్లకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా కంటి పరీక్షలు, ఎముకల సంబంధిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వైద్యుల సూచనల మేరకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. వయోవృద్ధులకు వైద్య పరీక్షలు సక్రమంగా జరిగేలా డే కేర్ సెంటర్ నిర్వాహకులు మహేష్ నాయుడు వైద్య సిబ్బందికి సహకరించారు. వయోవృద్ధుల ఆరోగ్య వివరాలను వైద్యులకు తెలియజేస్తూ, పరీక్షలు మరియు మందుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వయోవృద్ధులు పాల్గొన్నారు.

## నేడు జిల్లా యువజన కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం

జోగులాంబ గద్వాల : జోగులాంబ గద్వాల జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆర్. తిరుమలేష్ ఆధ్వర్యంలో రేపు జిల్లా పరిధిలో యువజన కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించడం జరుగుతుంది. ఈ సమావేశంలో గ్రామ మండల, తాలూకా, జిల్లా స్థాయిలోని యువజన కాంగ్రెస్ నాయకులకు భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి , తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌లు ఖలీద్ భవ్య , ఎస్.ఎస్ దీపక్ ప్రజ్ఞ , తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తదితర ముఖ్య నాయకులు హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లా పరిధిలోని యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని యువజన కాంగ్రెస్ అసెంబ్లి వైస్ ప్రెసిడెంట్ గద్వాల మాచర్ల లక్ష్మణ్ విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా ప్రెషర్స్ డే

**కొత్త విద్యార్థులకు స్వాగతం పలికిన అధ్యాపకులు.. విద్యార్థులకు దిశానిర్దేశం డీఐఈఓ నరేంద్ర కుమార్, ప్రిన్సిపాల్ డి. సైదులు...**







ఆత్మకూర్ : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతనంగా కళాశాలలో చేరిన విద్యార్థుల కోసం ప్రెషర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఐఈఓ నరేంద్ర కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కళాశాల విద్యార్థి జీవితంలో కీలకమైన దశ అని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని తెలిపారు. తల్లిదండ్రులు, అధ్యాపకుల సూచనలు పాటిస్తూ మంచి విద్యార్థులుగా ఎదగాలని ఆకాంక్షించారు.కళాశాల ప్రిన్సిపాల్ డి. సైదులు మాట్లాడుతూ నూతనంగా కళాశాలలో అడుగుపెట్టిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కళాశాలలో అందుబాటులో ఉన్న విద్యా అవకాశాలను వినియోగించుకుని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అధ్యాపకులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, పరిచయ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమం విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. కళాశాల సీనియర్ అధ్యాపకులు భాగ్యవర్ధన్ రెడ్డి,టీజే విశ్వేశ్వర్, రాఘవేంద్రరావు, సునీల్ కుమార్, కురుమూర్తి,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





# ఆశ, అంగన్వాడీల సేవలు వెలకట్టలేనివి








## అంగన్ మిలన్ సేవలో పాల్గొనడం సంతోషదాయకం: మహబూబ్ నగర్ ఎంపీ అరుణమ్మ

మహబూబ్ నగర్ : ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా చేపట్టిన 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా, మహబూబ్ నగర్ జిల్లా నవాబ్‌పేట్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 'అంగన్ మిలన్ సేవ' కార్యక్రమంలో శుక్రవారం ఎంపీ డీకే. అరుణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొనడం తనకు ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. సమాజ శ్రేయస్సు కోసం, ప్రజారోగ్యం కోసం క్షేత్రస్థాయిలో నిరంతరం శ్రమిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు, ఆశా వర్కర్లను మనస్ఫూర్తిగా అభినందిస్తూ, గర్భిణీలు, బాలింతలతో కలిసి వారిని ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, వ్యాక్సినేషన్, ఇతర సంక్షేమ పథకాల ఆవశ్యకతను ఆమె తెలియజేశారు . ప్రజారోగ్య పరిరక్షణలో మన ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది అందిస్తున్న సేవలు నిజంగా వెలకట్టలేనివి. ఈ కార్యక్రమంలో నాతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పార్టీ శ్రేణులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అమృత్ 2.0 పనులను వేగవంతం చేయాలి



వేకువ సమయం న్యూస్ //మంచిర్యాల సెప్టెంబర్ 25, 2026 : ప్రజలకు నిరంతరం శుద్ధమైన త్రాగునీటిని అందించే లక్ష్యంతో చేపట్టిన అమృత్ 2.0 పథకం పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శుక్రవారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొనసాగుతున్న అమృత్ 2.0 పథకంలో భాగంగా నస్పూర్‌లోని ఆర్‌కే-6 వద్ద నిర్మిస్తున్న 1 వేయి కిలోలీటర్ల సామర్థ్యం గల ఎలివేటెడ్ లెవల్ సర్వీస్ రిజర్వాయర్, హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్మిస్తున్న 1 వేయి 500 కిలోలీటర్ల సామర్థ్యం గల ఈ.ఎల్.ఎస్.ఆర్. నిర్మాణ పనులను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పనులను నిర్దేశిత ప్రమాణాలు, నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. పనులలో జాప్యం లేకుండా అదనపు కార్మికులను సమీకరించి, శ్రామిక బలాన్ని పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అమృత్ 2.0 పథకం క్రింద చేపట్టిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన త్రాగునీటి సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. అనంతరం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భావన సముదాయంలో గల జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్ లో అధికారులు, ఎల్.పి.జి. డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలకు ఎల్.పి.జి. గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్యాస్ సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన కార్యాచరణ ప్రకారం వినియోగదారుల ఈ-కెవైసి ప్రక్రియను పూర్తి చేయాలని, నిర్ణీత గడువులోగా ప్రక్రియ పూర్తి చేసేలా వినియోగదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గుండారాజ్యం నుంచి గ్లోబల్ హబ్‌గా యూపీ: అమిత్ షా

మొదటి పేజీ తరువాయి

ఉత్తర్ ప్రదేశ్‌లో గతంలో రాజ్యమేలిన మాఫియాను భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం పూర్తిగా తుడిచిపెట్టేసిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ఇప్పుడు పరిశ్రమలు, పెట్టుబడులకు ఎంతో అనుకూలమైన వాతావరణాన్ని యోగీ సర్కారు సృష్టించిందని అమిత్ షా చెప్పారు. ఇవాళ (శుక్రవారం) నోయిడాలో నిర్వహించిన 'యుపీ ఇంటర్నేషనల్ ట్రేడ్ షో 2026' ప్రారంభోత్సవంలో అమిత్ షా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కేంద్ర హోంమంత్రి యూపీలో 2017కి ముందున్న పరిస్థితులను, యోగి ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రి అయిన తర్వాత జరిగిన మార్పులను ప్రస్తావించారు.

గుండారాజ్యం నుంచి శాంతిభద్రతల వైపు

'2017కి ముందు రాష్ట్రంలో మాఫియా పాలన నడిచేది. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి యోగి ఆదిత్యనాథ్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత శాంతిభద్రతలను పునరుద్ధరించారు. రౌడీయిజం, మాఫియా మూలాలను ఉపేక్షించకుండా తొలగించడమే ఈరోజు రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు కారణం' అని అమిత్ షా తెలిపారు.

'2013లో అప్పటి సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) ప్రభుత్వం పరిశ్రమలను ఆకర్షించడానికి ఒక ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ ఏర్పాటు చేయాలనుకుంది. కానీ లఖ్‌నవూలో శాంతిభద్రతలు క్షీణించడంతో ఆ కార్యక్రమాన్ని ఢిల్లీకి తరలించాల్సి వచ్చింది. అధికారులు కూడా లఖ్‌నవూ వాతావరణం బాగోలేదని ఒప్పుకున్నారు. కానీ నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారింది' అని అమిత్ షా వ్యాఖ్యానించారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రంలో యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలోని 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వం వల్లే ఈ అద్భుత పరివర్తన సాధ్యమైందని అమిత్ షా కొనియాడారు. ఈ భద్రత, స్థిరత్వం వల్లే ఉత్తర్ ప్రదేశ్ ఈరోజు 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ వరుసగా మూడుసార్లు ప్రజల నమ్మకాన్ని గెలుచుకుని రాజకీయ స్థిరత్వాన్ని అందించారని, దీనివల్ల విధాన నిర్ణయాలు వేగంగా అమలవుతున్నాయని అమిత్ షా చెప్పారు. పాలనానుభవంతో కొత్త పాలసీలు తెస్తూ భారత్‌ను ప్రపంచ తయారీ కేంద్రంగా మోదీ తీర్చిదిద్దారని అమిత్ షా పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా అమిత్ షా ODOP (ఒకే జిల్లా – ఒకే ఉత్పత్తి) నూతన వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఈ పథకం ద్వారా యూపీ యువత ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లే అవసరం లేకుండా సొంత ఊర్లోనే ఉద్యోగాలు పొందుతున్నారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ ట్రేడ్ షో ద్వారా స్థానిక తయారీదారులకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.






OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085